





• జిల్లా కేంద్రంలోని బస్టాండ్ వద్ద కిక్కిరిసిన ప్రయాణికులు

"ప్రభుత్వం మహాలక్ష్మి పథకం ద్వారా ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించడంతో బస్సులు ఓవర్‌లోడ్‌తో రాకపోకలు సాగిస్తున్నాయి. గతంలో సొంత వాహనాలు, ఆటోలు, ఇతర ప్రత్యామ్నాయ రవాణా సదుపాయాలతో ప్రయాణించే మహిళలంతా ఆర్టీసీ బస్సులను ఆశ్రయిస్తున్నారు. దీంతో ఒక్కసారిగా బస్సుల్లో రద్దీ మొదలైంది. సిట్టింగ్ కెపాసిటీ కంటే అధికంగా ప్రయాణికులు ఉండడంతో బస్సులు సైతం మొరాయిస్తున్నాయి. తరచూ మరమ్మతులకు చేరుతున్నాయి.

'మహాలక్ష్మి'తో ఆర్టీసీపై ఓవర్‌లోడ్!

- పథకం అమలుతో ఒక్కసారిగా పెరిగిన రద్దీ
- ఒక్కో బస్సులో వంద మందికి పైగా ప్రయాణికులు
- ఓవర్‌లోడ్‌తో విరుగుతున్న పట్టీలు, అరుగుతున్న టైర్లు
- రీజియన్ పరిధిలో తగ్గిన అద్దె బస్సుల సంఖ్య
- కిక్కిరిసిన ప్రయాణికులతో కండక్టర్లు, డ్రైవర్లకు ఇక్కట్లు



బస్సు మొరాయించడంతో రిపేర్ చేస్తున్న సిబ్బంది

సుభాష్‌నగర్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించాలన్న ఉద్దేశ్యంతో అమలు చేసిన మహాలక్ష్మి పథకం ఆర్టీసీ యాజమాన్యానికి భారంగా మారింది. పథకం ప్రారంభం తర్వాత బస్సుల్లో ప్రయాణికుల రద్దీ పెరిగింది. సిట్టింగ్ కెపాసిటీ కంటే రెండింతలకు పైగా బస్సుల్లో ప్రయాణాలు సాగిస్తుండటంతో బస్సులు తరచూ మరమ్మతులకు చేరుతున్నాయి. 50 మంది ప్రయాణించాల్సిన బస్సులో వంద ముప్పైకి పైగా ప్రయాణికులు రాకపోకలు సాగిస్తున్నారు. ఓవర్ లోడ్ సమస్యతో ప్రయాణికులతో పాటు ఆర్టీసీ యాజమాన్యం సైతం ఇబ్బందులకు గురవుతోంది. ప్రతీరోజు నిజామాబాద్ రీజియన్ వ్యాప్తంగా లక్షకు పైగా ప్రయాణికులు సంస్థ బస్సులల్లో ప్రయాణిస్తుంటారు. నిజామాబాద్ రీజియన్‌లోని ఆరు డిపోల్లో సుమారు 587కు పైగా బస్సులు రోజువారీగా తిరుగుతుంటాయి. గతంతో పోలిస్తే సంస్థ బస్సుల్లో ప్రయాణించేవారి సంఖ్య రెండింతలకు పైగా పెరగడంతో బస్సులు.. భరువును మోయలేకపోతున్నాయి. ఎక్కడంటే అక్కడ రిపేర్‌లు కావడంతో ప్రయాణికులకు సైతం ఇబ్బందిగా మారింది. ప్రయాణికుల రద్దీని తట్టుకోవడానికి సంస్థ అధికారులు అన్ని రకాలుగా ప్రయత్నాలు చేస్తున్నా.. ఫలించడం లేదు. రోజురోజుకూ ప్రయాణికుల సంఖ్య పెరుగుతూనే ఉంది.

విరుగుతున్న పట్టీలు, అరుగుతున్న టైర్లు..

ఒక్కో బస్సుల్లో వంద మందికి పైగా ప్రయాణం కొనసాగించడంతో భారమంతా బస్సు పట్టీలపై పడడంతో తరచూ విరిగిపోతున్నాయి. టైర్లు సైతం తొందరగా అరిగిపోతున్నాయి. వీటన్నింటికీ తోడు గతంతో పోలిస్తే మైలేజీ సైతం తక్కువగా వస్తోంది. దీంతో సంస్థకు అదనపు భారం పడుతోంది. పథకం అమలు నుంచి మెకానిక్‌లు ఎప్పటికప్పుడు బస్సులను రిపేర్ చేయలేక ఇబ్బందులు పడుతున్నారు. ఎప్పుడు ఏ బస్సు రిపేర్ వస్తుందో తెలియక ఆందోళన చెందుతున్నారు. గతంలో నెలలో 50 బస్సులకు మరమ్మతులు చేయాల్సి వస్తుండగా ప్రస్తుతం వాటిసంఖ్య వందకు పైగా పెరిగింది.

కండక్టర్లు, డ్రైవర్లకు తప్పని కష్టాలు..

ప్రయాణికుల రద్దీతో కండక్టర్లు, డ్రైవర్లు అష్ట కష్టాలు పడుతున్నారు. కిక్కిరిసిన ప్రయాణికులతో కండక్టర్లు బస్సు మొదటి నుంచి చివరి వరకు వెళ్లి టికెట్ ఇచ్చే పరిస్థితి లేకుండా పోయింది. మహిళా కండక్టర్ల పరిస్థితి మరీ దారుణంగా తయారైంది. కండక్టర్లు, డ్రైవర్లతో ప్రయాణికులు తరచూ గొడవలకు దిగడంతో సిబ్బంది ఇబ్బందులకు గురవుతున్నారు. కొన్ని చోట్ల కండక్టర్లు, డ్రైవర్లపై దుర్భాషలకు దిగిన సందర్భాలు ఉన్నాయి. దీనికి తోడు సీట్ల కోసం ప్రయాణికులు గొడవలకు దిగుతున్నారు.

తగ్గిన అద్దె బస్సుల సంఖ్య..

మహాలక్ష్మి పథకం ప్రారంభించిన తర్వాత అద్దె బస్సుల సంఖ్య తగ్గింది. గతంలో నిజామాబాద్ రీజియన్‌లో 220 అద్దె బస్సులు తిరుగుతుండగా.. ప్రస్తుతం వాటి సంఖ్య 160 చేరింది. వీటిలో సైతం రోజువారిగా రిపేర్లు వస్తుండటంతో వాటి సంఖ్య కూడా తగ్గుతూ వస్తోంది. అద్దె బస్సులల్లో కొన్నిరూట్‌లలో విపరీతమైన ట్రాఫిక్ ఉండటంతో ఆ రూట్‌లలో అద్దె బస్సులు మరమ్మతులకు గురవుతున్నాయి. 2014-15కు సంబంధించిన బస్సులు సైతం మార్చి నెలతో వాటి ఒప్పందం ముగియనుంది. ప్రభుత్వం మహాలక్ష్మి పథకం తర్వాత అద్దె బస్సులకు రూ.5వేలు పెంచినా ఏమాత్రం సరిపోవడం లేదని అద్దె బస్సు యజమానులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

షెడ్డుకే పరిమితమైన బస్సులు..

రీజియన్ పరిధిలో కొన్ని బస్సులకు కాలపరిమితి ఉన్నా.. అధికంగా ప్రయాణికులను తీసుకుపోవడంతో రిపేర్లకు గురై షెడ్డులకే పరిమితమయ్యాయి. నిజామాబాద్, నందిపేట్ రూట్‌లలో నడిచే నాన్‌స్టాప్ మినీ బస్సులు షెడ్డులకే పరిమితమయ్యాయి. నాలుగు బస్సులు రిపేర్‌లకు రావడంతో వాటిని షెడ్డుకే పరిమితం చేశారు. వీటితో పాటు మరికొన్ని బస్సులు సైతం బస్ డిపోలకే పరిమితమయ్యాయి. ఓవర్‌లోడ్ సమస్యతోనే ఈ బస్సులన్నీ షెడ్డుకు పరిమితమైనట్లు సమాచారం. ఇప్పటికైనా అధికారులు బస్సుల సంఖ్యను పెంచాలని ప్రయాణికులు కోరుతున్నారు

అద్దె బస్సుల సమస్యలు పరిష్కరించాలి..

: అశోక్, హైర్ బస్సుల సంఘం నాయకుడు



అద్దె బస్సుల యజమానులు చాలా సమస్యలతో పోరాడుతున్నారు. మహాలక్ష్మి పథకం వచ్చిన తర్వాత తరచూ రిపేర్లకు గురవుతున్నాయి. ప్రభుత్వం ఉపశమనం కోసం రూ.5వేలు పెంచినా ఏమాత్రం సరిపోవడం లేదు. డ్రైవర్లు సైతం జీతాలను పెంచారు. డ్రైవర్ల ఇబ్బంది కూడా ఉంది. టైర్లు సంస్థ నుంచి ఇప్పించాలి. ఆర్టీసీ యాజమాన్యం ఇచ్చే వాటిలో కట్ చేసుకొని టైర్లు ఇవ్వాలి.

ఓవర్‌లోడ్ సమస్యను అధిగమిస్తాం..

: జ్యోత్స్న, ఆర్టీసీ ఆర్ఎం (నిజామాబాద్)



ప్రయాణికులను తమ గమ్యస్థానాలకు చేర్చేందుకు మెరుగైన సేవలను అందించేలా కృషి చేస్తాం. రీజియన్ పరిధిలో కొంతమేర ఓవర్‌లోడ్ సమస్య ఉంది. ఆ రూట్‌లలో అదనపు బస్సులను పెంచుతాం. రీజియన్‌కు ఇప్పటికే 40 ఎలక్ట్రిక్ బస్సులు వచ్చాయి. వాటిని కూడా ఇతర రూట్‌లలో తిప్పుతాం. ఇప్పటికే ఎక్స్‌ప్రెస్, లగ్జరీ బస్సులను పెంచాం. రిపేర్లను కూడా తగ్గిస్తాం.

ఇంటర్వ్యూ

ఉత్తమ ఫలితాలే లక్ష్యం..



- ప్రత్యేక కార్యాచరణతో ముందుకు వెళ్తున్నాం
- చదువులో వెనకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ
- 'ఆంధ్రజ్యోతి' ఇంటర్వ్యూలో డీఈవో అశోక్

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

నిజామాబాద్ అర్బన్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి ఫలితాల్లో జిల్లా ఉత్తమ ఫలితాలు సాధించాలనే లక్ష్యంతో ముందుకు వెళ్తున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారి అశోక్ తెలిపారు. పదో తరగతి వార్షిక పరీక్షలను దృష్టిలో పెట్టుకొని ప్రత్యేక కార్యాచరణతో ముందుకు వెళ్తున్నట్లు ఆయన తెలిపారు. 'ఆంధ్రజ్యోతి'కి ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన పదో తరగతి విద్యార్థులకు నిర్వహిస్తున్న ప్రత్యేక తరగతుల గురించి వివరించారు.

ఆంధ్రజ్యోతి: పదో తరగతి విద్యార్థుల సిలబస్ ఎంతవరకు పూర్తయ్యింది. ఎప్పటిలోగా పూర్తి చేస్తారు?

డీఈవో: జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న పదో తరగతి విద్యార్థుల సిలబస్ ఇప్పటికే 80శాతం పూర్తయ్యింది. సంక్రాంతి పండుగ లోపు పూర్తి సిలబస్ పూర్తికానుంది. ఆ తర్వాత రెండు నెలల పాటు రివిజన్ తరగతులు నిర్వహిస్తాం.

ఆంధ్రజ్యోతి: గత ఏడాది ఎంత శాతం ఉత్తీర్ణత వచ్చింది. ఈ యేడాది ఎంత ఉత్తీర్ణత సాధిస్తారు?

డీఈవో: జిల్లాలో గత ఏడాది పదో తరగతి ఫలితాలల్లో 93.72 శాతం ఉత్తీర్ణత సాధించి రాష్ట్ర స్థాయిలో 14వ స్థానంలో నిలవడం జరిగింది. వచ్చే పదో తరగతి ఫలితాల్లో జిల్లా విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించేందుకు ప్రత్యేక కార్యాచరణతో ముందుకు వెళ్తున్నాం. టాప్ ఐదు స్థానాల్లో జిల్లా ఉండేలా ప్రయత్నాలు చేస్తున్నాం.

ఆంధ్రజ్యోతి: ఈసారి ఫలితాల మెరుగుదలకు ఎలాంటి ప్రణాళికలతో వెళ్తున్నారు?

డీఈవో: గత ఏడాదితో పోలిస్తే ఈ యేడాది పదో తరగతి వార్షిక పరీక్షలకు ప్రత్యేక ప్రణాళికతో ముందుకు వెళ్తున్నాం. పరీక్షలంటే విద్యార్థులకు భయం లేకుండా ప్రత్యేక నిపుణులతో విద్యార్థులకు తరగతులు నిర్వహిస్తున్నాం. నవంబరు 1 నుంచి ఉదయం, సాయంత్రం వేళల్లో విద్యార్థులకు ప్రత్యేక తరగతులను నిర్వహిస్తున్నాం.

ఆంధ్రజ్యోతి: చదువులో వెనకబడిన విద్యార్థులపై ఎలాంటి శ్రద్ధ తీసుకుంటున్నారు?

డీఈవో: రెగ్యులర్ విద్యార్థులతో పాటు చదువులో వెనకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ పెడుతున్నాం. సబ్జెక్టుల వారీగా ప్రత్యేక తరగతులను నిర్వహిస్తున్నాం. విద్యార్థులకు గత పరీక్షలకు సంబంధించిన ప్రశ్నాపత్రాలతో సిద్ధం చేస్తున్నాం. స్లిప్ టెస్టులు నిర్వహిస్తున్నాం. చదువులో వెనకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి పెట్టి వారిని పరీక్షలకు సిద్ధం చేస్తున్నాం.

అధ్వానంగా గ్రామీణ రోడ్లు

- మరమ్మతులకు నోచుకోని రహదారులు
- వాహనదారులకు తప్పని ఇబ్బందులు
- పట్టించుకోని ప్రజాప్రతినిధులు,అధికారులు

7



పూసల తండా-గడ్కోల్ గ్రామాల మధ్య రోడ్డు ఇలా..

విషాదం

- అమెరికా రోడ్డు ప్రమాదంలో బోధన్ వాసి మృతి
- జిల్లా కేంద్రానికి చెందిన యువకుడికి తీవ్ర గాయాలు



పంజాల నీరజ్ గౌడ్ (ఫైల్)

బోధన్‌రూరల్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): బోధన్ పట్టణంలోని గౌడ్స్ కాలనీకి చెందిన పంజాల నీరజ్ గౌడ్ (23) అనే యువకుడు అమెరికాలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. జిల్లా కేంద్రంలోని ఎల్లమ్మ గుట్టకు చెందిన శ్రీధర్ అనే విద్యార్థికి తీవ్ర గాయాలయ్యాయి. సంవత్సరంన్నర క్రితం వీరిద్దరు ఉన్నత చదువుల కోసం అమెరికా వెళ్లి న్యూహెవెన్ సిటీలో ఉంటూ విద్యనభ్యసిస్తున్నారు. ఈ నెల 16న బ్రిడ్జిపోర్టు ప్రాంతానికి వెళ్లి కారులో తిరిగి వస్తుండగా తీవ్రంగా మంచు కురుస్తుండడంతో కారు అదుపు తప్పి పక్కనే ఉన్న పోలీసు పెట్రోలింగ్ కారును ఢీకొంది. ఈ ప్రమాదంలో గాయపడిన నీరజ్ గౌడ్‌ను ఆసుపత్రికి తరలిస్తుండగా మృతి చెందాడు. శ్రీధర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. అమెరికా పెట్రోలింగ్ పోలీసు జీపులోకి పోలీసు సిబ్బందికి సైతం తీవ్ర గాయాలయ్యాయి. మరో ఐదు నిమిషాల్లో వీరు నివాసం ఉండే రూమ్‌కు చేరుకునే సమీపంలో ప్రమాదం చోటు చేసుకోవడం ఇరు కుటుంబాల్లో విషాద ఛాయలు అలుముకున్నాయి. బోధన్‌కు చెందిన పంజాల నీరజ్ గౌడ్ తండ్రి శంకర్ గౌడ్ నెమ్లి ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు. మృతదేహన్ని స్వదేశానికి రప్పించడానికి ప్రయత్నాలు చేస్తున్నామని కుటుంబ సభ్యులు తెలిపారు.

ఇళ్ల సర్వేను పకడ్బందీగా నిర్వహించాలి

- ఈ నెలాఖరు లోగా సర్వే ప్రక్రియను పూర్తి చేయాలి
- కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు

మోర్తాడ్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): గ్రామాలల్లో ఇందిరమ్మ ఇళ్ల సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు అధికారులకు సూచించారు. గురువారం మోర్తాడ్, ఒడ్యాట్ గ్రామాల్లో కొనసాగుతున్న ఇందిరమ్మ ఇళ్ల సర్వే ప్రక్రియను ఆయన పరిశీలించారు. మోర్తాడ్‌లో సర్వేయర్లు దరఖాస్తుదారుల ఇళ్లకు వెళ్లి వివరాలు సేకరిస్తున్న తీరును పరిశీలించారు. మొబైల్ యాప్‌లో నమోదు చేసిన వివరాలు, దరఖాస్తుదారుల వాస్తవ వివరాలను సరిపోయాయా? అని అడిగి తెలుసుకున్నారు. అధికారులకు పలు సూచనలు చేశారు. దరఖాస్తు దారుల స్థితిగతులను క్షేత్రస్థాయిలో క్షుణ్ణంగా పరిశీలిస్తూ పూర్తి సమాచారాన్ని సేకరించి మొబైల్ యాప్‌లో పొందుపర్చాలని తెలిపారు. దరఖాస్తు దారుడు ప్రస్తుతం నివాసిస్తున్న ఇంటి ఫోటోతో పాటు సొంత ఇళ్ల అయితే డాక్యూమెంట్లు, ఇంటి చెల్లించిన రసీదులను యాప్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. ఎలాంటి తప్పిదాలు లేకుండా ఈ నెలాఖరులోగా సర్వే ప్రక్రియను పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు.



సర్వే వివరాలను పరిశీలిస్తున్న కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు

జ్యోతిబాపూలే పాఠశాల తనిఖీ

మండలంలోని మహాత్మా జ్యోతిబాపూలే బీసీ బాలుర గురుకుల పాఠశాలను కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టోరూం, వంటశాల, డైనింగ్‌హాల్‌ను పరిశీలించారు. షోరూంలో నిల్వ ఉంచిన సన్నబియ్యం, ఇతర సరుకుల నాణ్యతను, విద్యార్థుల కోసం వండిన భోజనాన్ని పరిశీలించి నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. డైట్ చార్జీలను 40శాతం వరకు పెంచుతూ ప్రభుత్వం ఇటీవల అమలులోకి తెచ్చిన మెనూ ప్రకారం భోజనం అందిస్తున్నారా లేదా అని గమనించారు. విద్యార్థులకు సాధారణ ఆరోగ్య పరీక్షలు నిర్వహించేందుకు వీలుగా పాఠశాలల ఏర్పాటు చేసిన వైద్యశిబిరాన్ని పరిశీలించి అందుబాటులో ఉంచిన ఔషధాలను పరిశీలించారు. విద్యార్థులకు క్రమం తప్పకుండా హెల్త్ చెకప్ నిర్వహించాలని అన్నారు. అనంతరం పదో తరగతి గదిని సందర్శించిన కలెక్టర్ విద్యార్థులను పలు ప్రశ్నాలు అడిగి వారి విద్య సామర్థ్యాన్ని అంచనా వేశారు. చక్కగా చదువుకొని వృద్ధిలోకి రావాలని మార్గనిర్దేశం చేశారు. ఆయా సబ్జెక్టులలో వెనుకబడిన విద్యా ర్థులను గుర్తించి వారికి ప్రత్యేక బోధన అందిస్తూ మెరుగైన ఫలితాలు వచ్చేలాగా అంకిత భావంతో కృషి చేయాలని పాఠశాల నిర్వాహకులను కలెక్టర్ ఆదేశించారు. కలెక్టర్ వెంట ఆర్డీవో రాజాగౌడ్, ఎంపీడీవో తిరుమల, తహసీల్దార్ సత్యనారాయణ, ఎంఆర్ఐ రంజిత్‌కుమార్, పాఠశాల ప్రిన్సిపాల్ ప్రసాద్, సిబ్బంది, తదితరులు ఉన్నారు.

'ధరణి' దరిద్రం పోయింది: గడుగు

నిజామాబాద్ అర్బన్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఐదేళ్ల పాటు రైతులను ఇబ్బందులు పెట్టిన 'ధరణి' దరిద్రం పోయిందని రాష్ట్ర వ్యవసాయ కమిషన్ సభ్యుడు గడుగు గంగాధర్ అన్నారు. గత ప్రభుత్వ హయాంలో తీసుకువచ్చిన ధరణి పోర్టల్‌తో రైతులు చాలా ఇబ్బందులు పడ్డారని భూములు ఉన్నా పాస్‌బుక్కులు రాక ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరిగారని అన్నారు. దళారులకు ధరణి వరంగా మారిందన్నారు. ప్రస్తుత ప్రభుత్వం గతంలో ఇచ్చిన హామీ మేరకు ధరణి స్థానంలో భూ భారతిని తీసుకొచ్చిందని ఏడాది కాలంగా రైతులు, మేధావులతో, రెవెన్యూ అధికారులతో చర్చించి సీఎం ఈ కొత్త చట్టాన్ని తీసుకువచ్చారని అన్నారు. అసెంబ్లీలో కొత్త ఆర్‌వోఆర్ చట్టం ప్రవేశపెట్టడం శుభపరిణామమని రైతులు పండుగ చేసుకుంటున్నారని అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావులకు ధన్యవాదాలు తెలిపారు.

సేంద్రియ పంటల పరిశీలన..

నగర శివారులోని న్యాల్‌కల్ రోడ్‌లో సేంద్రియ పంటలను గడుగు గంగాధర్ పరిశీలించారు. సేంద్రీయ పద్ధతిలో సాగు చేస్తున్న జామ, బొప్పాయి పంటలను పరిశీలించారు. ఆరోగ్యకరమైన వ్యవసాయ పద్ధతుల ద్వారా పంటలు పండించడం వల్ల లాభాలు కలుగుతాయని దీనిని రైతులు ఉపయోగించుకోవాలని గడుగు గంగాధర్ సూచించారు.



జామ పంటను పరిశీలిస్తున్న గడుగు గంగాధర్

ఉత్సాహంగా సీఎం కప్ క్రీడా పోటీలు

సుభాష్‌నగర్, డిసెంబరు 19 (ఆంధ్ర జ్యోతి): గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించాలనే ఉద్దేశ్యంతో ప్రభుత్వం నిర్వహిస్తున్న క్రీడా పోటీలు జిల్లా కేంద్రంలో ఉత్సాహంగా కొనసాగుతున్నాయి. గురువారం పాత కలెక్టరేట్ మైదానంలో ఖోఖో, కబడ్డీ, రెజ్లింగ్, యోగా పోటీలు జరిగాయి. నగరంలోని ఆఫీసర్స్ క్లబ్‌లో బ్యాడ్మింటన్ ఎంపికలు జరిగాయి. ఈ పోటీల్లో సుమారు 1200 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. ఈ పోటీలను జిల్లా యువజన క్రీడల శాఖ అధికారి ముత్తెన్న ప్రారంభించారు. నగరంలోని నాగారం స్టేడియంలో ఆర్చరీ ఎంపికలను నిర్వహించారు. ఈ పోటీల్లో గెలుపొందిన క్రీడాకారులను జిల్లా క్రీడల, యువజన శాఖ అధికారి అభినందించారు. ఇందులో ఎంపికైన వారిని రాష్ట్ర పోటీలకు పంపనున్నట్లు తెలిపారు. శుక్రవారం హాకీ ఎంపికలు, టేబుల్ టెన్నిస్, జూడో, ఉషూ పోటీలు జరుగనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యాయామ ఉపాధ్యాయ సంఘం అధ్యక్షుడు విద్యాసాగర్‌రెడ్డి, గోపిరెడ్డి, ప్రశాంత్, బుచ్చన్న, తదితరులు పాల్గొన్నారు.



ఆర్చరీ పోటీలో తలపడుతున్న క్రీడాకారులు

కొత్త చట్టాలు, సైబర్ నేరాల పట్ల అవగాహన



పోలీసు లోగోను ఆవిష్కరిస్తున్న దృశ్యం

బోధన్‌రూరల్,డిసెంబరు19(ఆంధ్రజ్యోతి): కొత్త చట్టాలు, సైబర్ నేరాల పట్ల ప్రతీ ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని బోధన్ పట్టణ సీఐ వెంకట నారాయణ తెలిపారు. గురువారం బోధన్ పట్టణంలోని రాకాసిపేట్ ప్రభుత్వ పాఠశాలలో బోధన్ డివిజన్ షీటీమ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా పోలీసు సిబ్బంది విజయ్, సుజాతలు మహిళలపై జరిగే నేరాల గురించి టీ సేఫ్ యాప్, డయల్ 100, గుడ్ టచ్, బ్యాడ్ టచ్, కొత్తచట్టాలపై, సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. అపరిచిత వ్యక్తులకు ఓటీపీ నెంబర్లు చెప్పవద్దన్నారు. రకరకాల మెస్సేజ్‌లతో సైబర్ నేరగాళ్లు ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తున్నారని, సైబర్ నేరాల ఫోన్‌కాల్స్‌పై జాగ్రత్తగా ఉండాలన్నారు. అనంతరం పోలీసు లోగోను ఆవిష్కరించారు.ఈకార్యక్రమంలో షీటీమ్ సిబ్బంది, పోలీసులు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయ బృందం,విద్యార్థులు పాల్గొన్నారు.

ఈవ్‌టీజింగ్ చేస్తే షీటీంకు సమాచారం ఇవ్వాలి

ముప్కాల్, డిసెంబరు19(ఆంధ్రజ్యోతి): మహిళల పట్ల అసభ్యకరంగా ప్రవర్తిం చిన, ఈవ్‌టీజింగ్ చేసిన షీటీంకు సమాచారం ఇవ్వాలని సబ్ డివిజన్ కానిస్టేబుల్ విగ్నేష్ సూచించారు. గురువారం బాల్కొండ మండలంలోని చిట్టాపూర్ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు సైబర్ క్రైంలపై షీటీం అవగాహన కల్పించారు. షీటీం ని రంతరం నిఘా ఉంటుందని, విద్యార్థులు, ఉద్యోగిని మహిళలు వేధింపులకు గురైన ప్పుడు షీటీం నెంబర్ 8712659795 నెంబర్‌కు సమాచారం ఇవ్వాలని, వారి పేర్లు గోప్యాంగా ఉంచుతామని, ఈవ్‌టీజింగ్‌లకు గురైనప్పుడు భయపడకుండా సమా చారం ఇస్తే రక్షణ కల్పిస్తామని వారు తెలిపారు. 100 డయల్ లేదా క్యూఆర్ కోడ్ ద్వారా షీటీంకు ఫిర్యాదు చేయవచ్చని విద్యార్థినిలకు సూచించారు. ఈ సందర్భంగా షీటీం పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సుమతి, రాజ్‌పాల్, ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్; రాంరెడ్డి, పద్మ, రాజేందర్, తదిత రులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల సర్వే పరిశీలన



కందకుర్తిలో సర్వే వివరాలు పరిశీలిస్తున్న తహసీల్దార్

రెంజల్,డిసెంబరు19(ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ పథకం ద్వారా అర్హులైన లబ్దిదారుల వివరాల కోసం నిర్వహిస్తున్న సర్వేను తప్పులు లేకుండా నమోదు చేయాలని తహసీల్దార్ శ్రావణ్ కుమార్ అన్నారు. గురువారం సాటాపూర్, నీలా, పేపర్‌మిల్, కందకుర్తి గ్రామాలలో చేపడుతున్న ఇందిరమ్మ ఇళ్ల సర్వేను ఆయన పరిశీలించారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శులు మహబూబ్ అలీ, సాయిలు, భాస్కర్, జూనియర్ అసిస్టెంట్ గౌతం, కారోబార్ షాజీద్ తదితరులున్నారు.

కోటగిరి: కోటగిరి మండలంలోని కొత్తపల్లి, దేవుని గుట్ట తండా గ్రామాలలో ఇందిరమ్మ ఇళ్ల యాప్ సర్వేను గురువారం తహసీల్దార్ గంగాధర్ పరిశీలించారు. అర్హులైన ప్రతి ఒక్కరిని ఇందిరమ్మ ఇళ్ల సర్వే యాప్‌లో నమోదు చేయాలని సూచించారు. సర్వే త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శులు ఉన్నారు.

రైతు బజార్ పరిశీలన



రైతు బజార్ మడిగెలను పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్

ఆర్మూర్‌టౌన్, డిసెంబరు19(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని అంగడిబజార్‌లో నిర్మించిన రైతు బజార్ నూతన మడిగెలను గురువారం మున్సిపల్ చైర్‌పర్సన్ వన్నెల్‌దేవి లావణ్య శ్రీనివాస్ పరిశీలించారు. రైతులకు మడిగెల కేటాయింపు కొరకు టెండర్‌లు పిలువగా 25మంది టెండర్‌లో పాల్గొన్నారని, జనవరి 1నుంచి రైతులకు మడిగెలు కేటాయిస్తామని ఆమె తెలిపారు. రైతు బజార్‌లో ప్లాస్టిక్ వాడకాలను నిషేదిస్తున్నామని, పాస్టిక్‌గా బదులుగా జూట్ బ్యాగులు, బట్ట సంచులు వాడాలని సూచించారు. ఆమె వెంట మున్సిపల్ కమిషనర్ రాజు, డీఈ భూమేశ్వర్; తదితరులు పాల్గొన్నారు.

కళ్యాపూర్‌లో గడ్డివాము దగ్ధం



దగ్ధమవుతున్న గడ్డివాము

రెంజల్, డిసెంబరు19(ఆంధ్రజ్యోతి): మండలంలోని కళ్యాపూర్ గ్రామానికి చెందిన బోర్గాం జలయ్య అనే రైతుకు చెందిన గడ్డివాము పూర్తిగా దగ్ధమైంది. గుర్తు తెలియని వ్యక్తులు గడ్డివాము దగ్ధం చేసి ఉంటారని ఆయన తెలిపారు.పశువుల మేత కోసం 350గడ్డి కట్టలను పశుగ్రాసం ఉంచగా గుర్తు తెలియని వ్యక్తులు నిప్పంటించి ఉంటారని ఆయన తెలిపారు. గడ్డివాము పూర్తిగా కాలిపోవడంతో పశువులకు పశుగ్రాసం ఇబ్బందిగా మారిందన్నారు. గడ్డివాముకు నిప్పంటించిన అనుమానితులపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు బాధితులు జలయ్య తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి



లక్ష్మణ్(ఫైల్)

మోస్రా,డిసెంబరు19(ఆంధ్రజ్యోతి): నిజామాబాద్ రూరల్ మండలం మల్లారం అటవీ ప్రాంతంలో టాటా ఏస్, ద్విచక్ర వాహనం ఢీకొని మృతి చెందిన ఘటన చోటు చేసుకుంది. రూరల్ పోలీసు స్టేషన్ ఎస్సై ఆరీఫ్ తెలిపిన వివరాల ప్రకారం మోస్రా మండల కేంద్రానికి చెందిన కొత్తిమీర్‌కర్ లక్ష్మణ్ తండ్రి మోహన్ మోస్రాలో మొబైల్ షాప్ నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నారు. గురువారం మొబైల్ షాప్‌కు సంబంధించిన సామాను నిమిత్తం మోస్రా నుంచి నిజామాబాద్‌కు వెళ్తున్న సమయంలో మల్లారం గండి వద్ద అశోక్ లేలాండ్ ట్రాలీ డ్రైవర్ తన వెహికిల్ అతివేగంగా, అజాగ్రత్తగా నడిపి లక్ష్మణ్ నడిపిస్తున్న ద్విచక్రవాహనానికి ఢీ కొనగా లక్ష్మణ్ తలకు, ఇతర చోట్ల గాయాలయ్యాయి. 108అంబులెన్సుకు సమాచారం అందించగా హాస్పిటల్ తరలించే సమయంలో లక్ష్మణ్ మృతి చెందారు. మృతుని యొక్క అన్న కొత్తిమీర్‌కర్ రాహుల్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని రూరల్ ఎస్సై ఆరీఫ్ తెలిపారు.

ఆలయ నిర్మాణానికి లక్ష రూపాయల విరాళం

కమ్మర్‌పల్లి, డిసెంబరు 19: (ఆంధ్రజ్యోతి) మండలకేంద్రంలో నూతనంగా నిర్మిస్తున్న అయ్యప్ప స్వామి ఆలయ పూర్తిస్థాయి నిర్మాణం నిమిత్తం కమ్మర్‌పల్లి గ్రామానికి చెందిన ఎన్నారై(యూఎస్ఏ) చింత బలరాం తమవంతుగా లక్ష రూపాయల విరాళాన్ని అందజేశారు. కమ్మర్‌పల్లిలో నిర్మాణంలో ఉన్న ఆలయన్ని గురువారం ఆయన తన సోదరుడు చింత హన్మంతుతో కలిసి సందర్శించి పరిశీలించారు. ఈ మేరకు ఆలయ నిర్మాణ బాధ్యులకు లక్ష రూపాయల చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎంపీ వైద్యుడు చింత హనుమంతు, బద్రీ, బద్దం రాజశేఖర్, తదిత స్థానిక అయ్యప్ప స్వాములు పాల్గొన్నారు.

మాల మహానాడు నాయకుల ముందస్తు అరెస్టు

బోధన్‌రూరల్,డిసెంబరు19(ఆంధ్రజ్యోతి): మాల మహానాడు నాయకులను పోలీసులు ముందస్తు అరెస్టు చేయడం సరికాదని మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు ఆనంపల్లి ఎల్లమయ్య అన్నారు. గురువారం ఆయన మాట్లాడుతూ సుప్రీంకోర్టు తీర్పును వ్యతిరేకిస్తూ మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు చెన్నయ్య పిలుపు మేరకు ఛలో అసెంబ్లీ ముట్టడి కార్యక్రమంలో భాగంగా గురువారం తెల్లవారుజాము నుంచి బోధన్ పోలీసులు పట్టణంలోని మాల మహనాడు నాయకులను ముందస్తు అరెస్టు చేయడం సరికాదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని మాల మహానాడు నాయకులు ముందుండి ఓట్లు వేసి గెలిపించారని, ప్రభుత్వానికి మద్దతు ఇవ్వకుండా మనువాదులకు సపోర్ట్ చేసిన నాయకులకు కాంగ్రెస్ ప్రభుత్వం వత్తాసు పలకడం సరైంది కాదన్నారు. ఎస్సీ వర్గీకరణ రాజ్యాంగ బద్దంగా జరిగేంత వరకు తమ పోరాటం కొనసాగిస్తామన్నారు. రాష్ట్రంలో దళితుల జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్ల శాతం పెంచేందుకు కృషి చేయాలని కోరారు. పోలీసులు అరెస్టు చేసిన వారిలో నవీపేట మాజీ ఎంపీపీ సంగం శ్రీనివాస్, మాల మహనాడు రాష్ట్ర కార్యదర్శి నీరడి ఈశ్వర్, బోధన్ డివిజన్ ఉపాధ్యక్షులు కారం స్వామి, వల్లాటి యాదగిరి, శ్రీనివాస్ తదితరులున్నారు.

డొంకేశ్వర్: మాలమహానాడు నాయకులను పోలీ సులు ముందస్తుగా అరెస్టు చేశారు. మాలమహానాడు రాష్ట్ర నాయకుల పిలుపు మేరకు అసెంబ్లీ ముట్టడిలో భాగంగా వీరిని అరెస్టు చేశారు. డొంకేశ్వర్ మండలంలో ఉన్న మాల మహానాడు ఐదుగురు నాయకులను గురువారం ఉదయం 4గంటలకు అరెస్టు చేశారు. అరెస్టు అయిన వారిలో మాలమహానాడు నాయకులు సుంకరి నాగరాజ్, పోగరి సంజీవ్, రాజేశ్వర్, రాము, రాజేష్, ఉన్నారు.

ఏర్గట్ల: ఎస్సీవర్గీకరణలో భాగంగా తమకు న్యాయం జరిగే వరకు పోరాడతామని మాల మహానాడు మండల అధ్యక్షుడు గన్నారం రాజేశ్వర్ అన్నారు. గురువారం ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా తలపెట్టిన చలో అసెంబ్లీ ముట్టడికి వెళ్లకుండా పోలీసులు వారిని ముందస్తు అరెస్టు చేశారు. ఈ కార్యక్రమంలో దిబ్బ సుదర్శన్, కుండ చక్రి,ఈర్గల గణేష్‌నాగార్జునలు ఉన్నారు.

నవీపేట: ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా గురువారం చేపట్టిన చలో అసెంబ్లీ కార్యక్రమంలో పాల్గొనకుండా పోలీసులు పలువురు మాల మహానాడు నాయకులను ముందస్తుగా అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా మాల మహానాడు నాయకులు మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ ప్రక్రియను నిలిపివేయాలని డిమాండ్ చేశారు. కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా అంబేద్కర్‌పై చేసిన అనుచిత వ్యాఖ్యలను ఖండించారు. ఈ కార్యక్రమంలో బుచ్చన్న, సాయిలు, సతీష్, రాజు, శ్యామ్ తదితరులున్నారు.

ఆర్మూర్‌టౌన్: మున్సిపల్ పరిధితో పాటు వివిధ గ్రామాల్లో ఉన్న మాలమహానాడు నాయకులను స్థానిక పోలీసులు ముందస్తు అరెస్టు చేశారు.ఈ సందర్భంగా మాల మహానాడు రాష్ట్ర నాయకుడు అర్గుల్ సురేష్ మాట్లాడుతూ రాష్ట్రపిలుపు మేరకు అసెంబ్లీ ముట్టడికి వెళ్లకుండా ముందస్తు అరెస్టు చేయడం అన్యాయమని రాష్ట్ర ప్రభుత్వ తీరుపై తీవ్రంగా ఖండించారు. అరెస్టులతో ఉద్యమం ఆగదని, రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటుకు మాలలు ఎంతో సహకరించారని, ఆ విషయం మరిచిపోతున్న సీఎం రేవంత్‌రెడ్డి వర్గీకరణ విషయంలో మరోసారి ఆలోచించాలని, విజ్ఞప్తి చేశారు. లేదంటే రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమం తీవ్రతరం చేస్తామని తెలిపారు. అరెస్టు అయిన వారిలో మాల మహానాడు నాయకులు అగ్గు క్రాంతి, ఆలూర్ ఉదయ్, జాదవ్‌రాజు, అనువతి రమేష్ కైలాస్, బేగరి రాకేష్, నీరడి దీపక్, తదితరులు ఉన్నారు.



బోధన్ పోలీస్ స్టేషన్‌లో మాల మహానాడు నాయకులు



ఆర్మూర్‌లో ముందస్తు అరెస్టు అయిన మాలమహానాడు నాయకులు



డొంకేశ్వర్‌లో..



నవీపేటలో..

అదనపు గదుల నిర్మాణ పనుల ప్రారంభం

ఏర్గట్ల, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని చిన్న రేండ్ల ముది రాజ్ సంఘానికి రూ.5లక్షలు, అలాగే గుండాల ముదిరాజ్ సంఘానికి రూ.2లక్షల50వేలు అదనపు గదుల నిర్మాణానికి ఎస్డీఎఫ్ ద్వారా నిధులు మంజూరు కాగా గురువారం కాంగ్రెస్ పార్టీ నాయకులు భూమిపూజ చేసి పనులను ప్రారంభిం చారు. ఈసందర్భంగా కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ అడిగిన వెంటనే నిధుల మంజూరు కృషి చేసిన బాల్కొండ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జీ ముత్యాల సునీల్‌కు మార్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈకార్యక్రమంలో జిల్లా పార్టీ ఉపాధ్యక్షుడు శివన్నోల్ల శివకుమార్, బద్ధం లింగారెడ్డి, గడ్డం జీవన్, పన్నాల నర్సా రెడ్డి, ముస్కు మోహన్, కాంగ్రెస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

'బ్యాంకు సేవలు వినియోగించుకోవాలి'

వేల్పూర్, డిసెంబరు19(ఆంధ్రజ్యోతి): తెలంగాణ గ్రామీణ బ్యాంక్ ద్వారా అందే సేవలను ప్రజలు వినియోగించుకోవాలని టీజీపీ బ్యాంక్ చైర్మన్ వై.శోభ అన్నారు. గురువారం వేల్పూర్ మండలంలోని రామన్నపేట్ గ్రామంలో తెలంగాణ గ్రామీణ బ్యాంక్ ద్వారా లోన్‌మేళా కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా బ్యాంక్‌చైర్మన్ శోభ మాట్లాడుతూ తమ బ్యాంకు ద్వారా హౌసింగ్ అగ్రికల్చర్, వెహికిల్, బిజినెస్, గోల్డ్ లోన్స్ ఇవ్వడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో రీజినల్ మేనేజర్ డీవీఎస్ రామారావు, స్థానిక బ్యాంకు మేనేజర్ చంద్రకాంత్ రెడ్డి, ఖాతాదారులు పాల్గొన్నారు.

కమ్మర్‌పల్లిలో ఎయిడ్స్‌పై అవగాహన



ఎయిడ్స్‌పై చిత్రప్రదర్శన ద్వారా అవగాహన కల్పిస్తున్న దృశ్యం

కమ్మర్‌పల్లి, డిసెంబరు 19: (ఆంధ్రజ్యోతి) మండలకేంద్రంలో గురువారం మహామ్మారి ఎయిడ్స్‌పై చిత్రప్రదర్శన ద్వార అవగాహన కల్పించారు. ఈసందర్భంగా మాజీ ఎంపీటీసీ మైలారం సుధాకర్ మాట్లడుతూ.. ప్రతీఒక్కరు మహామ్మారి ఎయి డ్స్ పట్ల అవగాహన పెంచుకుంటూ ఈవ్యాధి బారిన పడకుండా పదిగురికి అవగాహన కల్పించాలని సూచించారు. అనంతరం ఎయిడ్స్ వ్యాప్తి, నివారణ చర్యలు, తీసుకోవాలసిన ముందస్తు జాగ్రత్తలు తదితర అవశాలపై స్థానిక గ్రామపంచాయతీ వద్ద చిత్రప్రదర్శన ద్వారా అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వైఆర్‌జీ కేర్ లింక్ వర్కర్ రాజ్ కుమార్, స్థానికులు అనిల్, గంగాధర్, గ్రామస్థులు పాల్గొన్నారు.

అంబేద్కర్‌ను అవమానపర్చడం సమంజసం కాదు

ఆర్మూర్‌టౌన్,డిసెంబరు19(ఆంధ్రజ్యోతి):కేంద్రం హోంశాఖ మంత్రి అమిత్ షా అంబేద్కర్‌ను అవమానించడం సమంజసంకాదని మాదిగ సంఘా లు, ఉపకులాల సంఘాల నాయకులు ఖండించారు. గురువారం పట్టణంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ కేంద్ర మంత్రి అయిన అమిత్‌షా అంబేద్కర్ రాసిన రాజ్యాంగం వల్లనే మంత్రి పదవులు పొందారని, ఒక పక్క ప్రధాన మంత్రి, అంబేద్కర్ రాసిన రాజ్యాంగం వల్లనే ప్రపంచ దేశాల్లో భారత రాజ్యా ంగం ప్రజాస్వామిక దేశంగా గుర్తింపు వచ్చిందని చెబుతుండగా, అమిత్‌షా రాజ్యాంగాన్ని అవమానించడం సరికాదని, తక్షణమే భారతజాతికి క్షమాపణలు చెప్పాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మాదిగ సంఘాల యునైటెండ్ ఫ్రంట్ రాష్ట్ర అధ్యక్షుడు కొక్కెర భూమన్న, నాయకులు మోతె భూమన్న, బచ్చేపల్లి దేవయ్య, ఎర్రోల్ల మల్కన్న,మేతరి సాయన్న, నర్సింలు, పోశన్న, సురేష్, చిట్టిబాబు, గంగారాం గణేష్, తదితరులు పాల్గొన్నారు.

రెంజల్: కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా డాక్టర్ బీఆర్ అంబేద్కర్‌పై చేసిన అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా గురువారం మండలంలోని సాటాపూర్ చౌరస్తాలో బహుజన సంఘాల ఆధ్వర్యంలో అమిత్ షా దిష్టిబొమ్మను దగ్ధం చేసి నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మాల మహనాడు యూత్ అధ్యక్షుడు శ్రీకాంత్, మాల మహనాడు జిల్లా యూత్ ఉపాధ్యక్షులు గైని కిరణ్, గోసంగి సంఘం జిల్లా యూత్ అధ్యక్షుడు పత్రి సురేష్, జిల్లా బీసీ విద్యార్థి సంఘం అధ్యక్షులు సిరివేసు సంతోష్, మాల మహనాడు మండల మాజీ అధ్యక్షులు రాందాస్, లోక కృష్ణ, శ్రీకాంత్, రాజశేఖర్, రాకేష్, సరిదాస్, సల్మాన్, చంద్రకాంత్, శ్రీను, వినోద్, తదితరులు పాల్గొన్నారు.

జక్రాన్‌పల్లి: రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్.అంబేద్కర్‌పై అనుచిత వ్యాఖ్యాలు చేసిన కేంద్ర హోంమంత్రి అమిత్‌షా దిష్టిబొమ్మను అంబేద్కర్ యువజన నాయకులు దహనం చేశారు. గురువారం జక్రాన్‌పల్లి మండలం బ్రాహ్మణ్‌పల్లిలో కేంద్ర హోంమంత్రి అమిత్‌షా దిష్టిబొమ్మను దహనం చేసి అంబేద్కర్ యువజన సంఘం నాయకులు నిరసన తెలిపారు.ఈ కార్యక్రమంలో బ్రాహ్మణ్‌పల్లి మాజీ సర్పంచ్ దేవరాజ్, మాజీఎంపీటీసీ రాజు, అంబేద్కర్ యువజన నాయకులు సాగర్, అరుణ్, లక్ష్మణ్, సతీష్, ప్రభాకర్, సత్యనారాయణ, అనిల్, రాజ్‌కుమార్, సురేందర్, ప్రవీన్, సంజీవ్, తదితరులు ఉన్నారు.

వేల్పూర్: వేల్పూర్ మండలం పడిగెల గ్రామంలో కేంద్ర హోంమంత్రి అమిత్‌షా దిష్టిబొమ్మను దళితులు దహనం చేశారు. పార్ల మెంట్‌లో రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్‌పై అమిత్‌షా చేసిన అనుచిత వ్యాఖ్యలను వెంటనే వెనక్కి తీసుకోవాలని దళిత సంఘం డిమాండ్ చేస్తూ గ్రామ ఎస్సీ సంఘం ఆధ్వర్యంలో గురువారం గ్రామంలో డప్పువాయిద్యాల మధ్య ప్రధాన వీధుల గుండా అమిత్‌షా దిష్టిబొమ్మను శవయాత్ర నిర్వహించి అంబేద్కర్ విగ్రహం వద్ద దహనం చేశారు. పార్లమెంట్‌లో అంబేద్కర్ పేరును పలకడం ఫ్యాషన్ అయ్యిందని అమిత్‌షా చేసిన వ్యాఖ్యలను తీవ్రస్థాయిలో వ్యతిరేకించారు. భారత రాజ్యాంగ నిర్మాతను అగౌరపరిచేలా మాట్లాడినందుకు అమిత్‌షా భారత ప్రజలందరికి క్షమాపణ చెప్పాలని ఎస్సీ సంఘం సభ్యులు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సంఘ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

కమ్మర్‌పల్లి: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ కేంద్ర హోంమంత్రి అమిత్‌షా చేసిన అనుచిత వ్యాఖ్యలను వ్యతిరేకిస్తూ గురువారం కమ్మర్‌పల్లి మండల కాంగ్రెస్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈసందర్భంగా బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహానికి పులమాలలు వేసి నిరసన కార్యకంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు సుంకెట రవి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఆడెంగంగాప్రసాద్ ఏఎంసి ఉపాధ్యక్షుడు సుంకెట బుచ్చన్న, నిమ్మ ప్రసాద్, ప్రదీప్, పాష, శేఖర్, గణేష్ గౌడ్, సుంకెట శ్రీనివాస్, అజారోద్దీన్ కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

మెండోర: బాబాసాహెబ్ అంబేద్కర్‌పై అమిత్‌షా చేసిన వ్యాఖ్యలతో దేశప్రజల మనోభావాలు దెబ్బతిన్నాయని వేల్పూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ కొత్తింటి ముత్యంరెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సం దర్భంగా బాబాసాహెబ్ అంబేద్కర్‌పై కేంద్ర హోంమంత్రి అమిత్‌షా చేసిన వ్యాఖ్యలు బీజేపీ అహంకారానికి నిదర్శనమని విమర్శించారు.అంబేద్కర్‌ను అవమానించినం దుకు అమిత్‌షా వెంటనే క్షమాపణ చెప్పి మంత్రి పదవికి తక్షణం రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.



ఆర్మూర్‌లో అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న మాదిగ సంఘ నాయకులు



రెంజల్‌లో..

బాధిత కుటుంబాలకు సునీల్‌కుమార్‌రెడ్డి పరామర్శ

భీమ్‌గల్‌రూరల్, డిసెంబరు19(ఆంధ్రజ్యోతి):బడాభీమ్‌గల్‌లో ఎంజీతండా పరిధిలోని భూక్యతాండాకు చెందిన మో తీలాల్ ఇళ్లు ఇటీవల ప్రమాదవశాత్తు షాట్‌సర్క్యూట్‌కు గురై పూర్తిగా కాలిపోయిన విషయం తెలిసిందే. ఈ విషయం తెలుసుకున్న బాల్కొండ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జీ సునీల్‌కుమార్ గురు వారం బాధి త కుటుంబసభ్యులను పరామర్శించి ప్రమాదానికి గల కారణాలను అడి గితెలుసుకన్నారు. ఆయన వెంట కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

కమ్మర్‌పల్లి: మండల కేంద్రంలో బాధిత కుటుంబాలను బాల్కొండ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జీ ముత్యాల సునీల్‌కుమార్ రెడ్డి గురువారం పరామర్శించారు. మండలకేంద్రానికి చెందిన ఒక దినపత్రిక విలేఖరి బోడ్డు శంకర్ తల్లి బొడ్డు రాజాబాయి ఇటీవల మరణించడంతో ఆయనను కు టుంబ సభ్యులను పరామర్శించారు. కాగా కాంగ్రెస్ నాయకుడు సుంకరి రాజేశ్వర్ తండ్రి సుంకరి నర్సయ్య మంరణించడంతో రాజేశ్వర్‌ను ఆయన సోదరుడు సుంకరి మురళిని కుటుంబ సభ్యులను సునీల్ కుమార్ పరామర్శించారు. ఆయన వెంట కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సుంకెట రవి, ఏఎంసి వైస్ చైర్మన్ సుంకెట బుచ్చన్న, నాయకులు నిమ్మప్రసాద్, వేముల గంగారెడ్డి సింగిరెడ్డి శేఖర్, పాష, నల్ల సాయికుమార్ కార్యకర్తలు ఉన్నారు.



కుకునూర్‌లో మృతుని కుటుంబసభ్యులను పరామర్శిస్తున్న సునీల్‌కుమార్

వేల్పూర్: వేల్పూర్ మండలంలోని పలు గ్రామాలలో మృతుల కుటుంబాలను గురువారం బాల్కొండ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జీ సునీల్‌కుమార్‌రెడ్డి పరామర్శించారు. కుకునూర్ గ్రామానికి చెందిన గంగాధర్ తండ్రి చిన్న గంగారాం ఇటీవల అనారోగ్యంతో మరణిచారు. అలాగే వెంకటాపూర్ గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రిక్క ఆనంద్ వాళ్ల తల్లి భూదేవి ఇటీవలే మరణించింది. ఈ విషయం తెలుసుకున్న సునీల్‌రెడ్డి ఆయా కుటుంబాలను పరామర్శించి ప్రగాఢ సంతాపాన్ని, సానుభూతిని వ్యక్తం చేశారు.

అదుపుతప్పి వాహనం బోల్తా

భిక్కనూరు, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి):మండల కేంద్రంలోని 44వ జాతీయరహదారిపై చర్చి చౌరస్తా వద్ద టాటాఏస్ వాహనం అదుపు తప్పి బొల్తాపడగా వాహన డ్రైవర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. ప్రత్యక్ష సాక్షుల కథనం ప్రకారం హైదరాబాద్ వైపు నుంచి కామారెడ్డి వైపు బార్దాన్ లోడ్‌తో వస్తున్న టాటాఏస్ వాహనానికి ద్విచక్రవాహనం అడ్డ రావడంతో డ్రైవర్ సడెన్‌బ్రేక్ వేశాడు. దీంతో వాహనం అదుపుతప్పి బొల్తాపడింది. ఈ విషయం తెలుసుకున్న జీఎం ఆర్ సిబ్బంది, పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని బొల్తాపడిన వాహనాన్ని క్రేన్ సహయంతో తీయించి జీఎంఆర్, పోలీసు సిబ్బంది కిందపడిన బార్దన్ సంచులను లోడ్ చేసి పంపించారు. ట్రాఫిక్‌జాం కాకుండా చర్యఉల తీసుకోవడంతో పాటుగా జీఎంఆర్, పోలీసులు వాహనంలోకి సంచులను మోయడంతో వాహనదారులు, స్థానికులు వారిని అభినందించారు.

సమగ్ర శిక్షా ఉద్యోగుల సమ్మెకు మద్దతు

నవీపేట,డిసెంబరు19(ఆంధ్రజ్యోతి): తమ డిమాండ్ల సాధనకు ఈ నెల 9నుండి జిల్లా కేంద్రంలో నిరవధిక సమ్మె చేపడుతున్న సమగ్ర శిక్షా ఉద్యోగులకు మండల పీఆర్‌టీయూ ఉపాధ్యాయులు తమ సంఘీభావం ప్రకటించారు. స్థానిక మోడల్ పాఠశాలలో గురువారం జరిగిన మండల స్థాయి కాంప్లెక్స్ సమావేశానికి హజరైన మండల పీఆర్‌టీయూ ఉపాధ్యాయులు సమగ్ర శిక్షా ఉద్యోగుల సమ్మెకు మద్దతు ప్రకటించి తమ సంఘీభావం తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షులు మోహన్ రెడ్డి, ఎంఈవో అశోక్, పీఆర్‌టీయూ మండల అధ్యక్షులు భూమయ్య, ప్రధాన కార్యదర్శి శివకుమార్, మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయులు ఉన్నారు.

చికిత్స పొందుతూ వృద్ధుడి మృతి

భీమ్‌గల్‌రూరల్, డిసెంబరు19(ఆంధ్రజ్యోతి): మండలంలోని బాబానగర్ కాలనీకి చెందిన కుండాల పెద్ద సాయన్న అనే వృద్ధుడు నిజామాబాద్ ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందినట్టు భీమ్‌గల్ ఎస్సై మహేష్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం ఈనెల 13వ తేదీన రాత్రి మృతుడు కుప్పకంటి గ్రామశివారులో పొలంలో స్పృహ కోల్పోయి ఉన్నాడని వచ్చిన సమాచారం మేరకు అంబులెన్స్‌లో నిజామాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మొదట గుర్తుతెలియని వ్యక్తిగా కేసు నమోదు చేయగా, భీమ్‌గల్ మండలం బాబానగర్‌కు చెందిన వ్యక్తిగా గుర్తించి వృద్ధుడి భార్య కుండల కసమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం చేసి కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు ఎస్సై మహేష్ తెలిపారు.

రెంజల్‌లో కూరగాయల సంత ఏర్పాటు



కూరగాయలను కొనుగోలు చేస్తున్న ప్రజలు

రెంజల్,డిసెంబరు19 (ఆంధ్రజ్యోతి):రెంజల్ మండల కేంద్రంలో గురువారం కూరగాయల సంతను నూతనంగా గ్రామస్థులు ఏర్పాటు చేశారు. మండల కేంద్రమైన రెంజల్ గ్రామంలో మొదటి సారిగా కూరగాయల సంతను ఏర్పాటు చేయడంతో చుట్టు పక్కల గ్రామాల ప్రజలు అధిక సంఖ్యలో తరలివచ్చి సంతలో కూరగాయలు కొనుగోలు చేశారు. ప్రతి గురువారం రెంజల్ మండల కేంద్రంలో కూరగాయల మార్కెట్‌ను నిర్వహించడం జరుగుతుందని చుట్టు పక్కల గ్రామాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని గ్రామస్థులు తెలిపారు.

ఎల్లారెడ్డి ఎంఈవోకు మెమో జారీ

● ఎల్లారెడ్డి ఆర్డీవో మన్నె ప్రభాకర్

ఎల్లారెడ్డి,డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి):పట్టణ కేంద్రంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో హెచ్ఎం ఇన్‌చార్జి ఎంఈవోగా విధులు నిర్వహిస్తున్న వెంకటేశంకు మెమో జారీ చేసినట్లు ఎల్లారెడ్డి ఆర్డీవో మన్నే ప్రభాకర్ గురువారం ఓప్రకటనలో తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ బుధవారం పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేయగా పాఠశాలలో విద్యార్థినులకు మధ్యాహ్న భోజనం మెనూ ప్రకారం గుడ్డు పెట్టకపోవడం, సమయపాలన పాటించడం లేదని అదే విధంగా ముగ్గురు ఉపాధ్యాయులు రికార్డులలో సీఎల్ అని నమోదు చేశారు. వాటికి సంబంధించిన సెలవు ఉత్తర్వులు లేకపోవడంతో పాటు విధుల పట్ల నిర్లక్ష్యంగా ఉండడంవల్ల మెమో జారీ చేసినట్లు తెలిపారు. నివేదికను జిల్లా కలెక్టర్‌కు సమర్పిస్తామని పేర్కొన్నారు

భూమిని కబ్జా చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి

భిక్కనూరు, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): భిక్కనూరు మండల కేంద్రంలోని గ్రామపంచాయతీకి సంబంధించిన భూమిని కొందరు కబ్జా చేశారని వారిపై జిల్లా కలెక్టర్ చర్యలు తీసుకోవాలని ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు కర్రోల్ల రాజు డిమాండ్ చేశారు. గురువారం మండలకేంద్రంలో ఆయన మాట్లాడుతూ గ్రామపంచాయతీకి సంబంధించిన శ్మశానవాటిక భూమిని ఇటీవల కొందరు యథేచ్ఛగా చదును చేసి వెంచర్ వేయడానికి సిద్ధమయ్యారని ఆరోపించారు. ఈ స్థలంపై కలెక్టర్, కామారెడ్డి ఎమ్మెల్యే దృష్టిసారించి గ్రామపంచాయతీ భూమిని కాపాడాలని కోరారు. లేనియెడల అందోళన కార్యక్రమాల చేపడుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు పాల్గొన్నారు.

పెర్కిట్ పాఠశాల తనిఖీ

ఆర్మూర్‌టౌన్, డిసెంబరు19(ఆంధ్రజ్యోతి): మున్సిపల్ పరిధిలోని పెర్కిట్‌లో గల మహాత్మజ్యోతిబాపూలే పాఠశాలను గురువారం మున్సిపల్ కమిషనర్ రాజు పరిశీలించారు. పాఠశాలలోని వంట గదిని, పరిసర ప్రాంతాలను పరిశీలించి ప్రతీరోజు శుభ్రంగా ఉంచాలని, ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన డైట్‌మెనును విద్యార్థులకు అందుతుందా లేదా అని విద్యార్థినిలను అడిగితెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ జి.సృజన, సానిటరి ఇన్స్‌పెక్టార్ గజానంద్, పూర్ణమౌళి, పాల్గొన్నారు.

కడుపునొప్పి భరించలేక ఒకరి మృతి

భిక్కనూరు, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): భిక్కనూరు మండలంలోని జంగంపల్లి గ్రామంలో కడపునొప్పి భరించచలేక ఒకరు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు భిక్కనూరు ఎస్సై సాయికుమార్ గురువారం తెలిపారు.ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన బందెల శివరాజు((45) గత కొంతకాలంగా కడుపునొప్పితో బాధపడుతున్నాడు, ఎక్కడా చూపించిన తగ్గకపోవడంతో జీవితంపై విరక్తి చెంది తన కొట్టంలో దులానికి ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడని వివరించారు. మృతుడి భార్య లక్ష్మీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కామారెడ్డి ఆసుపత్రికి తరలించినట్లు ఎస్సై తెలిపారు.

ఉద్యమాల నిర్దిష్ట భావాలను

విద్యార్థులకు తెలియజేయాలి

▸ తెలుగు సదస్సులో ఓయూ ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ చింతకింది కాశీం




తెలుగు సదస్సులో మాట్లాడుతున్న ఓయూ ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొ.కాశీం, శ్యామల

డిచ్‌పల్లి, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): తెలుగు భాషలోని ఉద్యమాల నిర్దిష్ట భావాలను, అక్షర నిర్మాణ క్రమ వికాస దశలను కవులుగా ఉన్న వారు కళ్లకు కట్టిన విధంగా విద్యార్థులకు తెలియజేయాలని ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కాశీం అన్నారు. తెలంగాణ వర్సిటీలో తెలుగు విభాగం భారతీయ భాషా, సంరక్షణ కేంద్రం ఆధ్వర్యంలో బుధవారం తెలుగు పునశ్చరణ కార్యక్రమం రెండో జరిగింది. ఈ కార్యక్రమానికి హాజరైన ప్రొఫెసర్ చింతకింది కాశీం మాట్లాడుతూ విద్యార్థుల వద్ద తెలుగు నిఘంటువులు ఉండాలన్నారు. ప్రొఫెసర్ యుద్దనపుడి రెడ్డి శ్యామల మాట్లాడుతూ పదాలను నిర్మించడంలో ఎంపిక జాగ్రత్తగా చేసుకోవాలని సూచించారు. నిఘంటువుల అధ్యయనం లేని చదువులు హృదయానికి దగ్గర కావాలని వివరించారు. గుంటూరు లక్ష్మీ నర్సయ్య మాట్లాడుతూ.. తెలుగు కవిత్వ శిల్ప సౌందర్యం మనోవైజ్ఞానిక, తాత్వికత, ఆంగ్ల సాహిత్య ప్రభావం, లోతైన విశ్లేషణలతో విద్యార్థులకు వివరించారు. ప్రొఫెసర్ లావణ్య మాట్లాడుతూ.. తెలుగు వ్యాస పరిణామ దశలను వివరించారు. అందరూ చిన్న వ్యాసాలు, పెద్ద వ్యాసాలు రాయాలని భాషను ప్రేమతో చెప్పాలని ఆమె వివరించారు. ఈ సదస్సులో పరిశోధకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న లక్ష్మీనర్సయ్య

వణికిస్తున్న చలి



చలికి తట్టుకోలేక స్వెటర్ ధరించిన వాహనదారులు



చలి మంటలు కాచుకుంటూ ఉపశమనం పొందుతున్న యువకులు

డొంకేశ్వర్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): డొంకేశ్వర్ మండల వ్యాప్తంగా ఐదు రోజులుగా చలి విజృంభిస్తోంది. చలి తీవ్రత ఎక్కువగా ఉండడంతో బయటికి వెళ్లాలంటే ప్రజలు చలికి అవస్థలు పడుతున్నారు. రోజు రోజుకు చలి తీవ్రత క్రమేపి పెరుగుతూ వస్తుంది. బుధవారం డొంకేశ్వర్‌లో గరిష్ట ఉష్ణోగ్రత 24.0 డిగ్రీలు కాగా కనిష్ఠంగా 16.0 డిగ్రీల సెల్సియస్ నమోదయింది. ఉదయం, సాయంత్రం వేళల్లో మరింతగా చలి పెరుగుతుండడంతో ఇళ్ల నుంచి బయటకు వెళ్లాలంటేనే ప్రజలు జంకుతున్నారు. ముఖ్యంగా రాత్రుళ్లు చలి తీవ్రత ఎక్కువగా ఉండడంతో అవస్థలు పడుతున్నారు. ఉదయం 9 గంటల వరకు కూడా చలి ప్రభావం ఉండడంతో ప్రజలు గజగజ వణికిపోతున్నారు. సాయంత్రం 6గంటల నుంచి చలి ప్రభావం కనిపిస్తోంది. శీతల గాలుల కారణంగా పిల్లలు, వృద్ధులు ఇబ్బందులు పడుతున్నారు. చల్లగా వీస్తున్న గాలుల కారణంగా చలి ప్రభావం అధికంగా ఉంటోంది.

ఇబ్బందులు పడుతున్న ఉద్యోగులు..

చలి తీవ్రత పెరగడంతో ఉద్యోగులు తీవ్ర ఇబ్బం దులు పడుతున్నారు. ప్రభుత్వ ఉపాధ్యాయులు, గ్రామ పంచాయతీ కా ర్యదర్శులు అవస్థలు పడుతున్నారు. పాఠశాలలకు వెళ్లే చిన్నారులపైనా చలి ప్రభావం అధికంగా ఉంటోంది. పాలు, కూరగాయల వ్యాపారులు తెల్లవారు జామున 5 గంటలకే బయటకు వెళ్లాల్సి రావడంతో ఇబ్బందులు తప్పడం లేదు. ఉదయం 10 గంటల వరకు కూడా రోడ్లపైకి జనాలు వచ్చేందుకు ఆసక్తి చూపడం లేదు.

మంచుతో ఇబ్బందులు..

చలికి తోడుగా ఉదయం మంచు ఎక్కువగా చలి మంచు కారణంగా వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వివిధ అవసరాల కోసం బయటకు వెళ్లినప్పుడు రోడ్లన్నీ మంచుతో మంచు కప్పబడి వాహనాలపై ప్రయాణం సాగించే సమయంలో చలి తీవ్రత అధికంగా ఉంటోందని ప్రయాణికులు ఇబ్బందిపడుతున్నారు. ఉదయం 10 గంటలు దాటితే తప్ప సూర్యుడు కనిపించడం లేదు. మరికొందరు చలి తీవ్రత ఎక్కువగా ఉండడంతో చలి నుంచి ఉపశమనం పొందడానికి ఉదయం, రాత్రి వేళల్లో గ్రామాల్లో చలి మంటలు వేసుకుని చలి నుంచి ఉపశమనం పొందుతున్నారు.



ఆలయం వెనుక ఉన్న మూలమలుపు



పెర్కిట్‌లోని ఆసుపత్రి ఎదురుగా ప్రమాదకరంగా ఉన్న మూలమలుపు

ప్రమాదకరంగా మూల మలుపులు

▸ పెర్కిట్‌లో సూచికలు, స్పీడ్‌బ్రేకర్లు లేక రోడ్డు ప్రమాదాలు ▸ పట్టించుకోని అధికారులు

పెర్కిట్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని పెర్కిట్ రోడ్డుకు వెళ్లే ప్రధాన రహదారితో పాటు ఎంజే ఆసుపత్రి పక్కన పెర్కిట్ వరకు బైపాస్ రోడ్డు నిర్మాణం చేశారు. ఈ మార్గం గుండా నిత్యం వాహనాలు అధిక ప్రయాణం సాగిస్తాయి. పట్టణంలోని శ్రీ భాషిత, నారాయణ పాఠశాలలు పెర్కిట్ వెళ్లే మార్గంలో గల వెంకటేశ్వర ఆలయం(కుక్కలగుట్ట) వరకు మార్గం మొత్తం మూల మలుపులతో కూడా ఉంటంది. ఈ మూలుపులు అధిక భాగం ఉండడంతో అటు వైపు నుంచి వచ్చే వాహనాలు కనిపించడంలేదు. దీంతో తరచుగా వాహన ప్రమాదాలు జరుగుతున్నాయి. ఈ మార్గంగుండా పలు వాహనదారులు అధిక వేగంతో రావడం వల్ల ఇతర ప్రయాణికులు ఇబ్బందులకు గురవుతున్నారు. ఆసుపత్రి ప్రాంతం, ఆర్డీవో కార్యాలయం దగ్గరగా ఉండడం వల్ల రద్దీ ఎక్కువగా అయినప్పుడు వాహనాలు ఢీకొని ప్రజలు గాయాల పాలయ్యారు. ఈ ప్రమాదంలో మూల మలుపులు, సూచకబోర్డులు, స్పీడ్ బ్రెక్‌లు లేక పోవడంతో ప్రమాదాలు సంభవిస్తున్నాయని స్థానికులు వాపోతున్నారు. వెంటనే అధికారులు స్పందించి సూచికలు, స్పీడ్ బ్రెక్‌లు ఏర్పాటు చేసి రోడ్డుపై ఒక వైపు వాహనాలు వచ్చే విధంగా డివైడర్‌లు ఏర్పాటు చేయాలని వాహనదారులు, పట్టణ ప్రజలు కోరుతున్నారు.



గుడి వెనుక గల పాఠశాలలకు వెళ్లే ప్రమాదకర మూలమలుపు

స్పీడ్‌బ్రెక్‌లు, సూచికబోర్డు వెంటనే ఏర్పాటు చేయాలి..

● ఎ.ప్రవీణ్‌గౌడ్, స్థానికుడు

నిత్యం ఈ మార్గం గుండా అధిక సంఖ్యలో వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. మూల మలుపు ఎక్కువగా ఉండడంతో తరచూ ప్రమాదాలు ఢీకొని ప్రయాణికులు గాయాల పాలవుతున్నారు. వెంటనే స్పీడ్ బ్రేకర్‌లు, డివైడర్‌లు, సూచిక బోర్డును ఏర్పాటు చేయాలి.



మోడల్ స్కూల్ - చిన్న వాల్గోట్ రోడ్డుపై ధ్వసంమైన స్లాబ్ కల్వర్టు



పూసల తండా - గడ్కోల్ గ్రామాల మధ్యలో అధ్వానంగా మారిన రోడ్డు

అధ్వానంగా గ్రామీణ రోడ్లు

▸ మరమ్మతులకు నోచుకోక వాహనదారుల ఇబ్బందులు

▸ పట్టించుకోని పాలకులు

సిరికొండ, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతంలోని కుగ్రామాలకు వెళ్లే రోడ్లు ఏళ్ల తరబడి మరమ్మతులకు నోచుకోక పోవడం వల్ల తారు ధ్వంసమై కంకర రోడ్లు, మట్టి రోడ్లను తలపిస్తున్నాయి. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో మరమ్మతులకు నోచుకోని ఈ రోడ్లను కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది గడుస్తున్నా పాలకులు గ్రామీణ ప్రాంత రోడ్లను మరమ్మతు చేయడానికి చర్యలు తీసుకోకపోవడం బాధాకరమని ప్రయాణికులు ఆందోళన చెందుతున్నారు. సిరికొండ మండలంలోని పదేళ్ల బీఆర్ఎస్ ప్రభుత్వ పాలనలో సిరికొండ - చిన్నవాల్గోట్ గ్రామాల మధ్యలో గల సుమారు మూడున్నర కిలోమీటర్ల దూరం గల రోడ్డు మరమ్మతుకు నోచుకోకపోవడం వల్ల ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా ద్విచక్ర వాహనదారుల పరిస్థితి మరీ దారుణం రోడ్డు పొడవునా పెద్ద పెద్ద గుంతలు పడి వర్షాకాలంలో ద్విచక్ర వాహనాలపై ప్రయాణించడం ఆందోళన కరంగా ఉంటుంది. చిన్న వాల్గోట్, పెద్ద వాల్గోట్, పోత్నూర్ గ్రామాల ప్రజలు మండల కేంద్రానికి రావడానికి చాలా దగ్గరి మార్గమవుతుంది. అందుకని ఈ రోడ్డు చాలా బిజీబిజీగా ఉంటుంది. తారు రోడ్డు ధ్వంసమై మట్టి రోడ్డుగా అవతరించింది. గడ్కోల్ విద్యుత్ కేంద్రం నుంచి పూసల తండా వెళ్లే రోడ్డు కూడా తారు రోడ్డు ధ్వంసమై గుంతల గుంతలుగా మారి పోయింది. కొన్ని చోట్ల రోడ్డంతా ధ్వంసమయింది. మరి కొంతభాగం తారు లేచి కంకర రోడ్డుగా మారింది. కార్నల్ తండా నుంచి ముషీర్‌నగర్ మీదుగా మెట్టుమర్రి తండా, గడ్డమీది తండా నుంచి కొండపూర్ వరకు గల ఈ రోడ్డు చాలా చాలా చోట్ల పాడై గుంతల మయ మయింది. అక్కడక్కడ డాంబరు రోడ్డు పాడై పోయింది గుంతల రోడ్డుగా అవ తరించింది. తూంపల్లి నుంచి పాకాల వెళ్లే పంచాయతీ రాజ్ రోడ్డంతా గుంతల రోడ్డుగా మారి పోయింది. వాహనాల రాకపోకలకు తీవ్ర ఆటంకంగా మారింది. పాకాల నుంచి పందిమడుగు వెళ్లే రోడ్డు సైతం అధ్వానంగా మారింది. ఒకటి, రెండు కిలో మీటర్ల మేర రోడ్డును అప్పట్లో అటవీ శాఖ అధికారులు అడ్డుకోవడం వల్ల మట్టి రోడ్డుగానే మిగిలి పోయింది. వర్షాకాలంలో ఈ రోడ్డుపై రాక పోకలు నిలిచిపోతాయి. పంచాయతీ రాజ్ ఇంజనీరింగ్ అధికారులు మారుమూల గ్రామాలకు వెళ్లే రోడ్లను బాగు చేయడానికి ప్రభుత్వానికి నిధుల కోసం ప్రతిపాదనలు పంపించాలని ప్రజలు కోరుతున్నారు. ఇంజనీరింగ్ అధికారులను ప్రశ్నిస్తే ప్రభుత్వానికి ప్రతి పాదనలు పంపించామని చెబుతున్నారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు మాత్రం మార్చి తర్వాత ప్రభు త్వం నిధులు మంజూరు చేస్తుందని చెబుతున్నారు. డాక్టర్ భూపతిరెడ్డిపై మండల ప్రజలు ఎన్నో ఆశలు పెట్టుకుని ఎమ్మెల్యేగా గెలిపించారు. ప్రజల ఆశలను వమ్ము చేయకుండా మండలంలోని వివిధ గ్రామాలకు వెళ్లే రోడ్లను పక్కా రోడ్లుగా మార్చడానికి చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.



సిరికొండ - చిన్న వాల్గోట్ గ్రామాల మధ్యలో ధ్వంసమైన తారు రోడ్డు

ధర్మరక్షణకు ప్రతిఒక్కరూ నడుం కట్టాలి

● జగద్గురు నరేంద్ర ఆచార్య మహరాజ్



జుక్కల్ ఉప పీఠంలో ధర్మ బోధన చేస్తున్న స్వామీజీ

మద్నూర్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): ధర్మరక్షణ కోసం ప్రతిఒక్కరూ ముందుకు రావాలని తమ ధర్మాన్ని కాపాడుకోవాలని నానీజ్ ధాం జగద్గురు నరేంద్ర ఆచార్య మహరాజ్ పిలుపునిచ్చారు. జుక్కల్ మండలంలోని దోస్పల్లి బంగారు పల్లి వద్ద ఉపపీఠంలో ఆయన గురువారం భక్తులకు మార్గదర్శనం చేశారు. దేశంలో ధర్మరక్షణ కోసం ఆయా పీఠాల జగద్గురులు కృషి చేస్తున్నారని దాంట్లో భాగంగా మీరు సైతం మీ పరిధిలో ధర్మ రక్షణ కోసం పాటుపడాలని సూచించారు. అదే విధంగా సమాజంలో ప్రతిఒక్కరూ దైవభక్తిని అలవర్చుకోవాలని తద్వారా మానసిక ప్రశాంతత కలుగుతుందని అన్నారు. సనాతన ధర్మాన్ని రక్షించడానికి ప్రతీఒక్కరు ముందుకు రావాలని గుర్తు చేశారు. సనాతన ధర్మమంటే మన పూర్వీకులు ఆచరించిన ధర్మమే సనాతన ధర్మమని ఇంటి కొచ్చిన వారిని ప్రేమతో పలకరించడం, గురువులను తల్లి దండ్రులను, గౌరవించడం, ప్రతీరోజు దేవాలయానికి వెళ్లి పూజలు చేయడం సనాత ధర్మానికి గుర్తు అని తెలిపారు. అనాదిగా వస్తున్న మన ఆచార్య వ్యవహారాలాలను ఆచరించాలని గుర్తు చేశారు. గ్రామాల్లో ఉన్న దేవాలయాలకు వెళ్లి వాటిపై దృష్టి పెట్టాలని వాటి పరిరక్షణకు నడుం కట్టాలన్నారు. పూర్వీకులు నిర్మించిన ఆలయాలు సనాతన ధర్మా నికి ప్రతీకలని పేర్కొన్నారు. ప్రతీఒక్కరు భక్తి భావనను పెంపొందించుకోవాలని తద్వారా మానసిక ప్రశాంతత లభిస్తుందని పేర్కొన్నారు. వేద ధర్మేయులైన మనము ఆహారపు అలవాట్లను సాంప్రదాయ పద్ధతులను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. తల్లి దండ్రులు తమ పిల్లలకు చిన్ననాటి నుంచి భక్తి భావనను పెంపొందించేలా కృషి చేయాలని సూచించారు. హిందూ ధర్మం అంటే మాతృదేవోభవ, పితృ దేవోభవ, ఆచార్య దేవోభవ, అతిథి దేవోభవ ఇది మన వేదాలు మనకు ఇచ్చిన గొప్ప సూక్తి అని గుర్తు చేశారు. మన ధర్మాన్ని కాపాడని వారు భక్తికి అనర్హులని గుర్తు చేశారు. ప్రతిఒక్కరూ సనాతన భావం కోసం పాటు పడాలని పేర్కొన్నారు. కార్యక్రమానికి మహారాష్ట్ర, కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాల నుంచి భారీగా తరలివచ్చారు. స్వామీజీ దర్శనం కోసం గంటల తరబడి వేచి ఉన్నారు. అనంతరం స్వామీజీ భక్తుల సమస్యలకు పరిష్కార మార్గాలను చూపెట్టారు.



స్వామీజీ దర్శనానికి బారులు తీరిన భక్తులు

విజయ్ హైస్కూల్‌లో

బాలకవి సమ్మేళనం

నిజామాబాద్ అర్బన్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): నగరంలోని విజయ్ హైస్కూల్‌లో గురువారం బాలకవి సమ్మేళనం నిర్వహించారు. విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను, కవితా శక్తిని వెలికితీసి సాహిత్య స్పృహను కల్పించేందుకు ప్రతీ సంవత్సరం నిర్వహించే బాలకవి సమ్మేళనాన్ని ఈ సంవత్సరం కూడా నిర్వహించినట్లు విద్యాసంస్థల కోశాధికారి లలితాదేవి తెలిపారు. ఈ కార్యక్రమానికి ఐడీఎల్ ఎడ్యుకేషన్ సొసైటీ సభ్యురాలు తారాచౌదరి, లలితాదేవిలు ముఖ్య అతిథులుగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేశారు. మూడవ తరగతి నుంచి 10వ తరగతి చదువుతున్న వంద మంది విద్యార్థులు ఈ సమ్మేళనంలో పాల్గొన్నారు. సాంప్రదాయ దుస్తులు ధరించి శ్రవణానందకరంగా కవితలను వినిపించారు.



సమ్మేళనంలో పాల్గొన్న బాల కవులు

జాతీయ స్థాయికి సారంగాపూర్

జడ్పీహెచ్ఎస్ విద్యార్థుల ఎంపిక



జాతీయ స్థాయికి ఎంపికైన విద్యార్థులు

మోపాల్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): నిజామాబాద్ రూరల్ మండలంలోని సారంగాపూర్ జడ్పీహెచ్ఎస్ పాఠశాలకు చెందిన ఐదుగురు విద్యార్థులు తెలంగాణ రాష్ట్ర జట్టుకు ఎంపికై ఈ నెల 25న ఛత్తీస్‌ఘడ్‌లో జరిగే జాతీయ స్థాయి టోర్నమెంట్‌లో పాల్గొంటున్న విద్యార్థులను గురువారం ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. ఇటీవల మహబూబ్‌నగర్ జిల్లాలో జరిగిన 68వ రాష్ట్ర స్థాయి అండర్-19 నెట్‌బాల్ టోర్నమెంట్‌లో ఈ పాఠశాల విద్యార్థులు పాల్గొని ప్రతిభను కనబర్చారు. తమ పాఠశాలకు చెందిన విద్యార్థులు జాతీయ స్థాయిలో పాల్గొనడం అభినందనీయమని ఉపాధ్యాయ బృందం వారిని అభినందించారు. వీరితో పాటు గ్రామ పెద్దలు ఉన్నారు.

తిర్మన్‌పల్లి జడ్పీహెచ్ఎస్ విద్యార్థి..

నిజామాబాద్ రూరల్ మండలంలోని తిర్మన్‌పల్లి జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో 9వ తరగతి చదువుకుంటున్న సాయిదీక్షిత జాతీయ స్థాయిలో ఈనెల 25న ఛత్తీస్‌ఘడ్‌లోని బోర్బాలో జరిగే నెట్‌బాల్ పోటీకి ఎంపికైంది. ఎంపికైన విద్యార్థినిని గురువారం పాఠశాల ఉపాధ్యాయ బృందం ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు సీతాదేవి, ఉపాధ్యాయ బృందం, గ్రామ పెద్దలు ఉన్నారు.

మోకన్‌పల్లిలో చర్చి ప్రారంభం



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ రాజేశ్వర్

నవీపేట, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మోకన్‌పల్లిలో గురువారం నూతనంగా నిర్మించిన ఇమ్మానియల్ చర్చిని ప్రారంభించారు. ఈ సందర్భంగా చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. చర్చి ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మాజీ ఎమ్మెల్సీ రాజేశ్వర్ హాజరయ్యారు. అనంతరం పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఐపీసీ రాష్ట్ర అధ్యక్షుడు అహరోను, అనంతయ్య చౌదరి, నెహేమియా, జెకర్యా, సురేష్ కుమార్, ఆనంద్, జోసెఫ్, ఏసుదాసు, సోలోమన్, జాన్సన్ పాల్గొన్నారు.



మోకన్‌పల్లి చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహిస్తున్న దృశ్యం



అక్రమణలను తొలగిస్తున్న మున్సిపల్ సిబ్బంది

నగరంలో ఆక్రమణల తొలగింపు

సుభాష్‌నగర్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): నగరపాలక సంస్థలో అక్రమంగా ఏర్పాటు చేసుకున్న దుకాణాలను నగరపాలక సంస్థ అధికారులు గురువారం తొలగించారు. నగరంలోని రాష్ట్రపతిరోడ్, మెడికల్ కళాశాల, ప్రభుత్వ ఆసుపత్రి ముందరగల రోడ్లను ఆక్రమించి అక్రమంగా దుకాణాలను వేసుకున్న వాటిని తొలగించారు. ఈ సందర్భంగా మున్సిపల్ అధికారులు అక్రమంగా దుకాణాలు వేస్తే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు.

డిసెంబరు 31లోపు ఆస్తిపన్ను చెల్లించాలి



అధికారులతో సమీక్షిస్తున్న నగర మున్సిపల్ కమిషనర్

సుభాష్‌నగర్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఆస్తి పన్నులను డిసెంబర్ 31లోపు చెల్లించాలని నగరపాలక సంస్థ కమిషనర్ దిలీప్ కుమార్ అన్నారు. జిల్లా కేంద్రంలోని నగరపాలక సంస్థ కార్యాలయంలో మున్సిపల్ రెవెన్యూ అధికారులతో గురువారం సమీక్ష నిర్వహించారు. 2024కు సంబంధించిన ఆఫ్ ఇయర్లీ టాక్స్‌ను వెంటనే చెల్లించేలా కృషిచేయాలన్నారు. 31లోపు చెల్లించకపోతే పెనాల్టీ పడుతుందన్నారు. అధికారులు ఆస్తి పన్ను మొత్తం వసూలయ్యేలా చూడాలన్నారు.

ఆశావర్కర్లకు రూ.18వేల వేతనం ఇవ్వాలి



నగరంలో ర్యాలీ నిర్వహిస్తున్న ఆశా వర్కర్లు

సుభాష్‌నగర్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఆశావర్కర్ల సమస్యల పరిష్కారం కోసం సీఐటీయూ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బస్సు జాతా గురువారం నిజామాబాద్‌కు చేరుకుంది. సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షురాలు జయలక్ష్మికి జిల్లా నాయకులు ఘనస్వాగతం పలికారు. నగరంలోని జిల్లా పరిషత్ కార్యాలయం నుంచి సుభాష్‌నగర్, హమాల్‌వాడి చౌరస్తా మీదుగా భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షురాలు జయలక్ష్మి మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఆశా వర్కర్ల సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానని హామీ ఇచ్చిందన్నారు. కనీస వేతనం 18వేల రూపాయలు అమలు చేస్తామని హామీ ఇచ్చి సంవత్సరకాలం పూర్తవుతున్నా ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందన్నారు. అనేక మంది ప్రభుత్వం దృష్టికి, అధికారుల దృష్టికి తీసుకెళ్లిన ఫలితం లేదన్నారు. అనంతరం సీఐటీయూ జిల్లా కార్యదర్శి నూర్జహాన్ మాట్లాడుతూ చాలీ చాలని వేతనాలతో ఆశావర్కర్లు జీవితాలు కొనసాగిస్తున్నారని అన్నారు. ఆశావర్కర్లను కార్మికులుగా గుర్తించి కనీస వేతనం అమలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పద్మ, సాధన, గంగామణి, సునీత, బాలామణి, రేణుక, రేవతి, లలిత, భూలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

నుడా చైర్మన్‌ను కలిసిన బ్రాహ్మణ సంఘం ప్రతినిధులు

నిజామాబాద్ కల్చరల్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): నుడా చైర్మన్ కేశవేణును తెలంగాణ బ్రాహ్మణ సేవా సమితి ప్రతినిధులు మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. గురువారం ఆయనను కలుసుకొని శుభాకాంక్షలు తెలిపి బ్రాహ్మణుల సమస్యలను వివరించారు. ఈ సందర్భంగా సమితి జిల్లా అధ్యక్షుడు అనిల్‌కుమార్ మాట్లాడుతూ సమాజానికి నిరంతరం శుభాన్ని కోరే బ్రాహ్మణులకు జిల్లా కేంద్రంలో వెయ్యి గజాల స్థలాన్ని కేటాయించాలని కోరినట్లు తెలిపారు. 20వేలకు పైగా కుటుంబాలు ఉన్న బ్రాహ్మణులకు ఇప్పటి వరకు ఎవరు కూడా భవనం కోసం స్థలం ఇవ్వలేదని ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం స్థలం కేటాయిస్తే అందులో బ్రాహ్మణ భవనం నిర్మించడం జరుగుతుందన్నారు. పలు బ్రాహ్మణుల సమస్యలను సైతం చైర్మన్ దృష్టికి తీసుకువచ్చారు. ఈ కార్యక్రమంలో టిబిఎస్ఎస్ అధ్యక్షుడు మోహన్‌శర్మ, బ్రాహ్మణ సంక్షేమ వేదిక జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్, అర్చక సంఘం అధ్యక్షుడు కులకర్ణి విజయ్, కిశోర్ జోషి, జగన్, మధుసూదన్‌శర్మ, రమణారావు, సునీల్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

26న ఉపాధి హామీ ఆడిట్

డిచ్‌పల్లి, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): 2023-24 సంవత్సరం తాలూకు ఉపాధి హామీ సోషల్ ఆడిట్ 34 గ్రామాల్లో నిర్వహించిన పనుల వివరాలు మండల పరిషత్ కార్యాలయంలో ఈ నెల 26న ఎంపీడీవో కార్యాలయం జరగనుందని ఏపీవో సుధాకర్ తెలిపారు. 338 పనుల వివరాలను సిబ్బంది వివరాలను వెంట తీసుకురావాలని ఆయన కోరారు.



అంబేద్కర్ విగ్రహానికి క్షీరాభిషేకం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు



మాట్లాడుతున్న సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి రమేష్‌బాబు

అమిత్‌షాను వెంటనే సస్పెండ్ చేయాలి

- పార్లమెంట్‌లో అంబేద్కర్‌పై వ్యాఖ్యలకు నిరసనగా

అంబేద్కర్ విగ్రహానికి కాంగ్రెస్ నాయకుల క్షీరాభిషేకం

నిజామాబాద్ అర్బన్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): పార్లమెంట్‌లో కేంద్ర హోంమంత్రి అమిత్‌షా రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్‌పై చేసిన అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా టిపిసిసి పిలుపు మేరకు గురువారం నగరంలోని పూలాంగ్ చౌరస్తాలో నగర కాంగ్రెస్ అధ్యక్షుడు కేశవేణు ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా నాయకులు.. మాట్లాడుతూ పార్లమెంట్‌లో అంబేద్కర్‌ను కించపరుస్తూ మాట్లాడిన అమిత్‌షాను వెంటనే రాజీనామా చేయించాలన్నారు. దేశానికి రాజ్యాంగాన్ని అందించి ఇతర దేశాలకు ప్రజాస్వామ్యంలో దేశాన్ని ఆదర్శంగా ఉండేలా రాజ్యాంగాన్ని రచించిన అంబేద్కర్‌ను పార్లమెంట్ సాక్షిగా అమిత్‌షా అవమానించడం సరికాదన్నారు. ఈ విషయంలో రాష్ట్రపతి కలుగజేసుకొని ఆయనను సస్పెండ్ చేయాలని కేంద్ర హోంమంత్రి పదవికి రాజీనామా చేసి ప్రజలకు క్షమాపణ చెప్పాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ డి.రాజేశ్వర్, నాయకులు రత్నాకర్, వేణురాజ్, నరేందర్‌గౌడ్, ప్రీతమ్, వినయ్, సుభాష్‌జాదవ్, మాజీ మేయర్ ఆకుల సుజాత పాల్గొన్నారు.

కేంద్ర మంత్రి అమిత్‌షా క్షమాపణలు చెప్పాలి..

సుభాష్‌నగర్: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్‌పై అమిత్‌షా చేసిన వ్యాఖ్యలను సీపీఐఎం తీవ్రంగా ఖండిస్తుందని అమిత్‌షా భారతజాతికి క్షమాపణ చెప్పాలని పార్టీ జిల్లా కార్యదర్శి రమేష్‌బాబు డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ భారత ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం ప్రజలందరికి సమాన అవకాశాలు కల్పించడం కోసం అందరికి రాజ్యాంగ ఫలాలు దక్కాలని ఉద్దేశ్యంతో అంబేద్కర్ భారత రాజ్యాంగాన్ని రచిస్తే రాజ్యాంగానికే తూట్లు పొడుస్తుందన్నారు. అమిత్‌షా వైఖరిని సమర్థిస్తూ భారత ప్రధాని మోదీ మాట్లాడటం పూర్తిగా వ్యతిరేక వైఖరిని తెలియజేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు రాములు, రాజు, తదితరులు పాల్గొన్నారు.

అమిత్‌షా రాజీనామా చేయాలి : బీఎల్‌పీ నాయకులు

కేంద్ర హోం మంత్రి అమిత్‌షా పార్లమెంట్‌లో చేసిన అనుచిత వ్యాఖ్యలపై జాతికి క్షమాపణ చెప్పాలని కేంద్ర హోంమంత్రి పదవికి రాజీనామా చేయాలని బీఎల్‌పీ రాష్ట్ర అధ్యక్షుడు దండివెంకట్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భారత రాజ్యాంగం అన్ని మతాలకు, కులాలకు, ప్రాంతాలకు, సాంస్కృతిక, సంప్రదాయాలకు రక్షణ కవచం లాంటిదన్నారు. అంబేద్కర్ పేరు ఉచ్చరించడాన్ని మనువాద భావజాల ఆలోచనలు నిండిఉన్న బీజేపీ నాయకులు తట్టుకోలేకపోతున్నారని విమర్శించారు.

అక్రమ అరెస్టులను నిరసిస్తూ పంచాయతీ కార్మికుల ధర్నా

ధర్పల్లి, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): పంచాయతీ కార్మికులను, నాయకులను అర్ధరాత్రి అక్రమ అరెస్టు చేయడాన్ని నిరసిస్తూ గురు వారం స్థానిక ఎంపీడీవో కార్యాలయం ఎదుట గ్రామ పంచాయతీ కార్మి కులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా టీయూసీఐ కార్యదర్శి రమేష్ మాట్లాడుతూ.. గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యల పరి ష్కారానికి కార్మిక సంఘాల జేఏసీ తలపెట్టిన ఛలో హైదరాబాద్ కార్య క్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం అడ్డుకోవడం సిగ్గుచేటన్నారు. అన్యాయంగా గ్రామ పంచాయతీ కార్మికులను, నాయకులను అర్ధరాత్రి పోలీస్ స్టేషన్ లకు తరలించడం ప్రజాస్వామ్యంపై గొడ్డలిపెట్టు అని ఆరోపించారు. గ్రామ పంచాయతీ కార్మికులకు కనీస వేతన చట్టం, మల్టీపర్పస్ విధానం రద్దు చేయాలని, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. రిటైర్డ్‌మెంట్ బెనిఫిట్‌గా ప్రతీ కార్మికునికి 5లక్షలు ఇవ్వాలని లేనిపక్షంలో గ్రామ పంచాయతీ కార్మికులు పెద్ద ఎత్తున పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆశన్న, సాయిలు, విలాస్, గంగాధర్, కృష్ణ, రాములు, రమేష్, రవి, సాయవ్వ, సులోచన, సునీత, రాజవ్వ, తదితరులు పాల్గొన్నారు.



ధర్పల్లి- ధర్నా చేస్తున్న గ్రామ పంచాయతీ కార్మికులు

డిచ్‌పల్లి: పంచాయతీ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం జేఏసీ తలపెట్టిన చలో హైదరాబాద్‌ను పోలీసులు అడ్డుకొని అరెస్టులు చేయడం తగదంటూ ఎంపీడీవో కార్యాలయం ఎదుట కార్మికులు గురువారం ఆందోళన చేశారు. ఈ సందర్భంగా కార్మికులు మాట్లాడుతూ.. కార్మికులు, నాయకుల అరెస్టులను ఖండిస్తున్నామన్నారు. ప్రభుత్వం కార్మికులకు ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం ఎంపీడీవో శ్రీనివాస్ గౌడ్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్మిక నాయకులు రవి, పోశెట్టి, సంజీవ్, సాయిలు, కృష్ణ, దుర్గా, రమేశ్, మహేశ్ గౌడ్ పాల్గొన్నారు.

మోడల్ పాఠశాల ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

ధర్పల్లి, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): మోడల్ పాఠశాల ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరుతూ గురువారం స్థానిక మోడల్ పాఠశాల ఉపాధ్యాయులు తహశీల్దార్ మాలతి, ఎంపిడివో బాలకృష్ణలకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పిఎంటిఏ తెలంగాణ సంఘం తరఫున దశల వారిగా నిరసన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు వారు పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం మోడల్ పాఠశాల స్కూళ్లను పాఠశాల విద్యా డైరెక్టరేట్‌లో విలీనం చేసి మోడల్ స్కూల్ ఉపాధ్యాయులకు 010 పద్దతి కింద వేతనాలు చెల్లించాలని ఒకే నోటిఫికేషన్ కింద ఎన్నిక కాబడినప్పటికీ రెండవ దశలో నియామకమైన మోడల్ స్కూల్ ఉపాధ్యాయులకు నోషనల్ సర్వీస్ కల్పిస్తూ సమన్యాయం చేయాలని నోషనల్ సర్వీస్ మరియు నోషనల్ ఇంక్రిమెంట్ వర్తింపజేయాలని మోడల్ స్కూల్ ఉపాధ్యాయులకు హెల్త్ కార్డులు మంజూరు చేసి మరణించిన ఉపాధ్యాయుల కుటుంబాలకు కారుణ్యనియామకాలు కల్పించాలని వారికి పిపిఎస్ డెత్ గ్రాట్యుటీ, ఫ్యామిలీ పెన్షన్‌ను వెంటనే అందజేయాలని వారు డిమాండ్ చేశారు. ప్రమోషన్లు వెంటనే చేపట్టి పెండింగ్ బకాయిలను చెల్లించాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మోడల్ పాఠశాల ఉపాధ్యాయులు నాగేశ్వర్‌రావు, సంతోష్‌కుమార్, డానియల్, లక్ష్మీనర్సయ్య తదితరులు పాల్గొన్నారు.



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఉపాధ్యాయులు



ఆడిట్ నివేదికను చదివి వినిపిస్తున్న క్లస్టర్ అధికారి సత్యానారాయణ

సహకార సంఘంలో నిధుల దుర్వినియోగం!

- రూ.75 లక్షలు వాడుకున్న వ్యవసాయ సహకార సంఘం సిబ్బంది
- ఆడిట్ నివేదికలో బయటపడిన అవినీతి బాగోతం
- రికవరీ చేస్తామంటున్న సహకార సంఘం అధికారులు

సిరికొండ, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): సిరికొండ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో రూ.75లక్షల అవినీతి బాగోతం బయటపడింది. మండల కేంద్రంలో సహకార సంఘ మహాజన సభ అధ్యక్షుడు చెల్లం గంగారెడ్డి అధ్యక్షతన గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో గత ఆరు నెలల నుంచి సహకార సంఘ చట్టంలోని 51 సెక్షన్ ప్రకారం జరిగిన విచారణంలో రూ.75లక్షలు మాయమైనట్లు నివేదికలో బయట పడింది. క్లస్టర్ అధికారి సత్యనారాయణ నివేదికను చదివి వినిపించారు. గతంలో ఈ సంఘంలో కార్యదర్శులుగా పనిచేసిన సిబ్బంది, కొందరు డైరెక్టర్లు కలిసి రూ.75లక్షలు కాజేసినట్లు తేలింది. దీనిపై రైతులు సహకార శాఖ అధికారులపై, ఆడిటర్లపై తీవ్రంగా మండిపట్టారు. దీంతో డీసీవో నోటీసులు జారీ చేస్తారని క్లస్టర్ అధికారి చెప్పారు. గల్లంతైన నిధులను ఖచ్చితంగా రికవరీ చేస్తామని అన్నారు. ఈ సమావేశంలో అధ్యక్షుడు గంగారెడ్డి, ఉపాధ్యక్షుడు నర్సయ్య, మాజీ అధ్యక్షుడు మైలారం గంగారెడ్డి, రైతులు, డైరెక్టర్లు లింగం, రమేష్, సంతోష్‌రెడ్డి బాబన్న, గోవింద్, చిన్నారెడ్డి పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

మోపాల్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి):రూరల్ పోలీసు స్టేషన్ పరిధిలోని మల్లారం గండి వద్ద గురువారం మధ్యాహ్నం జరిగిన రోడ్డు ప్రమాదంలో మోస్రా గ్రామానికి చెందిన కొత్తిమిర్‌కర్ లక్ష్మణ్(23) మృతి చెందినట్లు ఎస్ఐ ఎండి.ఆరీఫ్ తెలిపారు. ఈ సంఘటన వివరాలు ఇలా ఉన్నాయి.. మోస్రా గ్రామానికి చెందిన లక్ష్మణ్ బైక్‌పై మోస్రా నుంచి జిల్లా కేంద్రానికి వస్తుండగా జిల్లా కేంద్రం నుంచి మోస్రా వైపు వెళ్తున్న టాటావ్యాన్ ఢీకొట్టడంతో ఈ ప్రమాదం జరిగిందని ఎస్ఐ తెలిపారు. మృతుడికి తలకు తీవ్ర గాయాలు కావడంతో 108అంబులెన్స్‌లో తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందినట్లు తెలిపారు. మృతుడి సోదరుడు ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

పగిలిన పైపు లైన్

డిచ్‌పల్లి, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): తహసీల్ కార్యాలయం ఎదుట వేసిన పైపులైన్ పగిలి నీరు వృథాగా పోయింది. దీంతో గురువారం ఉదయం ఘన్‌పూర్ గ్రామస్థులకు తాగునీరు సరఫరా కాలేదు. బుధవారం హడావిడిగా పైపులైన్ వేసి రాత్రి నీరు విడుదల చేయడంతో మూడు చోట్ల పైపుకు పగుళ్లు ఏర్పడ్డాయి.



పూజలు చేస్తున్న స్వాములు

నగరానికి చేరుకున్న అయోధ్య రాముడి పాదుకలు

నిజామాబాద్ కల్చరల్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): రాముడి జన్మస్థలం అయిన అయోధ్యకు బంగారు తాపరంతో తయారు చేసిన రాములవారి పాదుకలు నగరానికి చేరుకున్నాయి. భాగ్యనగరం నుండి అయోధ్య వరకు సాగనున్న స్వర్ణపాదుకల పాదయాత్ర గురువారం ఇందూరుకు చేరుకుంది. 14 కిలోల పంచలోహాలు బంగారం తాపురంతో తయారు చేసిన పాదుకలు రామరాజ్యం సెంట్రల్ ట్రస్ట్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అయోధ్య రాముడికి సమర్పించనున్నారు. రాముడు లక్ష్మణుడు, సీతతో కలిసి 14 సంవత్సరాలు వనవాసం చేసిన నేపథ్యంలో 14 సంవత్సరాల వనవాసాన్ని గుర్తు చేస్తూ ఈ పాదుకలను తయారు చేశారు. 14 రోజులలో దేశవ్యాప్తంగా పలు నగరాల గుండా పర్యటిస్తూ 14 రోజులలో అయోధ్యకు ఈ పాదుకల యాత్ర సాగనుంది. నగరానికి చేరుకున్న పాదుకలకు భక్తులు ఘనంగా స్వాగతం పలికారు. పాదుకలతో పాటు సీతారాముల విగ్రహాలను భక్తులు దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. పాదుకలకు శుక్రవారం ఉదయం ప్రత్యేక పూజలు నిర్వహించి ఆర్మూర్, ఆదిలాబాద్, నాగ్‌పూర్ మీదుగా అయోధ్యకు చేరుకుంటుంది. పాదుకలను శ్రీరామదీక్ష మాలాధారణ గురువు రామదాసు సురేష్, ఆత్మారామ్ మహారాజ్‌లు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ ముక్క దేవేందర్‌గుప్త, పద్మావతి, విహెచ్‌పి జిల్లా సహకార్యదర్శి రమేష్, ప్రసన్నకుమార్, శాంత, తదితర భక్తులు పాల్గొన్నారు.



సీతారామచంద్రస్వామి విగ్రహాలు, పాదుకలు

ఉపాధి కూలీలకు, వ్యవసాయ కార్మికులకు జీవన భృతి చెల్లించాలి

సిరికొండ, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఉపాధి కూలీలతో పాటు వ్యవసాయ కార్మికులందరికీ జీవన భృతి చెల్లించాలని ప్రగతి శీల వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామకృష్ణ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలంలోని గడ్కోల్ గ్రామంలో గురువారం నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం రూ.12వేల ఆర్థిక సహాయాన్ని రెండు విడతలుగా ఆరువేల చొప్పున వ్యవసాయ కూలీలకు ప్రభుత్వం చెల్లిస్తామని ప్రకటించడం హర్షనీయమన్నారు. అయితే కండిషన్‌గా వంద రోజులు కూలీ పనులు చేసిన వారికే చెల్లిస్తామని చెప్పడం ఆమోదించదగిన విషయం కాదన్నారు. ఉపాధి కూలీలకే కాకుండా వ్యవసాయ రంగంలో అనేక పనులు చేసే కూలీలున్నారని వారందకీ చెల్లించాలని రామకృష్ణ ప్రభుత్వాన్ని కోరారు. ఈ సమావేశంలో సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ ఆర్మూర్ డివిజన్ సహాయ కార్యదర్శి రమేష్, సంఘం నాయకులు దామోదర్, సాయరెడ్డి, బాల్‌రెడ్డి, గంగామల్లు, ఎర్రన్న, బాల్‌రెడ్డి, లింబాద్రి తదితరులు పాల్గొన్నారు.

మైలారంలో పెద్దమ్మతల్లి ఉత్సవాలు

సిరికొండ, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మైలారం గ్రామంలో గురువారం పెద్దమ్మతల్లి ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. మొదటి రోజు ఆలయం ఎదుట ధ్వజ స్తంభాన్ని ప్రతిష్ఠించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. శుక్రవారం పెద్దమ్మతల్లికి ప్రత్యేక పూజలు, యజ్ఞాలు చేయనున్నారు. భక్తులు బోనాలను సమర్పిస్తారు. ఈ కార్యక్రమాల్లో ముదిరాజ్ కులస్థులతో పాటు భక్తులు పాల్గొన్నారు.

మాల మహానాడు నాయకుల ముందస్తు అరెస్టు

సిరికొండ, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణను వ్యతిరేకిస్తూ చలో అసెంబ్లీకి మాలమహానాడు పిలుపు ఇచ్చిన నేపథ్యంలో గురువారం మాల మహానాడు నాయకులను పోలీసులు ముందస్తుగా అరెస్టు చేశారు. మండలానికి చెందిన అధ్యక్షుడు రాజేశ్వర్, జిల్లా వర్కిం గ్ ప్రసిడెంట్ హేమంత్, సుం కరి రాకేష్‌లను అరెస్టు చేశారు. ఈ సందర్భంగా హేమంత్ మా ట్లాడుతూ.. మాల మహానాడు అసెంబ్లీ ముట్టడికి పిలుపునిస్తే అరెస్టు చేయడమేమిటని ప్రశ్నిం చారు.

డిచ్‌పల్లి: అసెంబ్లీ శామావేశాల సందర్భంగా మాల మహానాడు నాయకులు గురువారం అసెంబ్లీ ముట్టడికి వెళ్తుండగా పోలీసులు అడ్డుకుని ముందస్తుగా అరెస్ట్ చేసి పోలీసు స్టేషన్‌కు తరలించారు.

చికెన్ ధరలు

రకం	: లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	: రూ.180	రూ.265	రూ. 285
వెన్‌కాబ్(కిలో)	: రూ.185	రూ.270	రూ. 290

బంగారం ధరలు

బిస్కెట్ (10 గ్రా.)	ఆర్నమెంట్(10 గ్రా.)	వెండి(10 గ్రా.)
రూ.78900	రూ.72700	రూ.930

సినిమా గైడ్ నిజామాబాద్

పీవీఆర్ మల్టీప్లెక్స్.. వేణుమాల్

స్క్రీన్-1 : పుష్ప-2 (10.00, 2.05, 6.10)
: ముఫాసా (ఇంగ్లీష్ 3డి) (10.15)
స్క్రీన్-2 : ముఫాసా (తెలుగు 3డి) (10.10, 1.00)
: పుష్ప-2 (3.50, 10.45)
: ముఫాసా (ఇంగ్లీష్ 3డి) (7.55)
స్క్రీన్-3 : విడుదల-2 (10.00)
: బచ్చలమల్లి (1.35, 7.30, 10.30)
: యుఐ (4.35)
స్క్రీన్-4 : బచ్చలమల్లి (10.25)
: యుఐ (1.25, 7.55)
: విడుదల-2 (4.20, 10.50)

ఉషాప్రసాద్ మల్టీప్లెక్స్..

స్క్రీన్-1
: బచ్చలమల్లి (10.20, 4.20, 10.35)
: విడుదల-2 (1.10)
: పుష్ప-2 (7.00)
స్క్రీన్-2 : విడుదల-2 (10.10, 7.35)
: యుఐ (1.20, 10.30)
: పుష్ప-2 (4.00)
స్క్రీన్-3
: ముఫాసా (తెలుగు 3డి) (11.00, 5.00, 7.35)
: పుష్ప-2 (1.15, 10.00)

దేవి : బచ్చలమల్లి (11.00, 2.00, 6.00, 9.00)
నటరాజ్ : విడుదల-2 (11.15, 2.15)
: ముఫాసా (6.15, 9.15)
విజయ్ : పుష్ప-2 (10.00, 2.00, 6.00, 10.00)
లలితామహల్ : యుఐ (11.15, 2.15)
: విడుదల-2 (6.15, 9.15)

- నిజామాబాద్ అర్బన్